# ప్రజల నెత్తిన కరెంటు ఛార్జీల భారమా?

## వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

## ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన హరీశ్‌రావు



హైదరాబాద్ పెన్ పవర్: ఒకవైపు ఎల్‌నినో.. మరోవైపు నిత్యావసర ధరల పెరుగుదలతో ప్రజలు అల్లాడుతుంటే.. ప్రభుత్వం వారి నెత్తిన కరెంటు ఛార్జీల రూపేణా రూ.5,420 కోట్ల భారాన్ని మోపడం సరైంది కాదని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో భారాస ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాజీ మంత్రులు సీహెచ్ లక్ష్మారెడ్డి, కొప్పుల ఈశ్వర్ తదితరులతో కలిసి మంగళవారం హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "దసరా, దీపావళి పండగల వేళ ప్రజలకు శుభవార్త చెప్పాల్సిన ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడం దారుణం. విద్యుత్ కొనుగోళ్లకు వెచ్చించిన సొమ్మును వినియోగదారుల నుంచే వసూలు చేయాలనుకోవడం ఎంతవరకు సమంజసం? బషీర్‌బాగ్ కాల్పులు జరిగి 26 ఏళ్లు అయింది.

-5లో

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్





# ఆ 45 ఎకరాలు ఎక్కడ..?

## ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష..

హైదరాబాద్, పెన్ పవర్, అక్టోబర్ 6: సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలోని భూముల వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.. ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు నిర్వహించిన భూ సర్వే వివరాలను రెవెన్యూ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.. ముఖ్యంగా ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో రికార్డులకు, క్షేత్రస్థాయి సర్వేకు మధ్య భారీగా భూమి వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు..

రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు నమోదై ఉండగా.. క్షేత్రస్థాయిలో అధికారులు నిర్వహించిన సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. దీంతో రికార్డుల్లో ఉన్న 388 ఎకరాలకు, భౌతికంగా గుర్తించిన 343 ఎకరాలకు మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఏర్పడింది.. ఈ 45 ఎకరాల భూమి ఎక్కడ ఉందో, ఏ ప్రాంతంలో ఉందో పూర్తి స్థాయిలో గుర్తించి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం..

### భూమి గుర్తింపుకు సమగ్ర సర్వే..

45 ఎకరాల భూమి ఆచూకీ తేల్చడంతో పాటు సర్వే నంబర్ 325కు సంబంధించిన భూములపై స్పష్టత తీసుకురావడానికి ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వే చేపట్టేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులు, సరిహద్దులు తదితర అంశాలను పరిశీలించి భూమి పూర్తి వివరాలను నిర్ధారించనున్నారు.

భూముల సరిహద్దులకు సంబంధించిన రికార్డులు, ఇతర ఆధారాలను కూడా అధికారులు పరిశీలించనున్నారు. ఈ క్రమంలో భూమి సరిహద్దులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు తమ ఆధీనంలోని భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, పత్రాలను సమర్పించేందుకు, నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది..

### అర్హులైన స్థానిక రైతులకు భూముల పంపిణీ..!

సర్వే ప్రక్రియ పూర్తయిన అనంతరం సర్వే నంబర్ 325లోని భూములపై ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకోనుంది.. అందులో గుర్తించిన భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీంతో సర్వే నెంబర్ 325 భూములపై ప్రభుత్వం చేపట్టబోయే తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది.. కొంత భూమిని రైతులకు కేటాయించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది..

### అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక కాలనీ..!

ఇదే భూమిలో తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ' నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు, మౌలిక సదుపాయాలతో కూడిన సమగ్ర కాలనీని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు..

కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని కూడా ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలుస్తోంది. అమరవీరుల కుటుంబాలకు గౌరవప్రదమైన నివాస వసతి కల్పించేలా కాలనీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సీఎం సూచించినట్లు సమాచారం..

### జూన్ 2లోగా నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశం..

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2లోగా అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలుస్తోంది.. దీంతో భూమి గుర్తింపు, సర్వే, రికార్డుల పరిశీలనతో పాటు కాలనీ నిర్మాణానికి సంబంధించిన చర్యలను కూడా అధికారులు వేగవంతం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తానికి సర్వే నెబర్ 325లో రికార్డుల్లో ఉన్న 388 ఎకరాలకు, క్షేత్రస్థాయిలో గుర్తించిన 343 ఎకరాలకు మధ్య ఉన్న 45 ఎకరాల భూమి ఎక్కడుంది..? ఎలా మిస్ అయింది..? అన్నది ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తుతోంది.. సమగ్ర సర్వే, రెవెన్యూ రికార్డుల పరిశీలన అనంతరం ఈ భూమికి సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది..

- సర్వే నెంబర్ 325పై సమగ్ర సర్వేకు రంగం సిద్ధం..!
- ఎర్రవల్లి, వెంకటాపురంలో సర్వే నోటిఫికేషన్ విడుదలకు చర్యలు..!
- రెవెన్యూ రికార్డుల సమర్పించేందుకు, కేసీఆర్ కుటుంబానికి నోటీసులకు ఆదేశం..
- అర్హులైన స్థానిక రైతులకు భూముల పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు..!
- అమరవీరుల కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ' నిర్మాణం.
- 2027 జూన్ 2లోగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు..

- సంబంధిత అధికారులకు సీఎం కీలక ఆదేశాలు..!
- ఎర్రవల్లి భూముల్లో 45 ఎకరాలు మాయం..!
- రికార్డుల్లో 388.. క్షేత్రస్థాయిలో 343 ఎకరాలే..!
- ఆ 45 ఎకరాలు ఎక్కడున్నాయో తేల్చండి: సీఎం ఆదేశం..




# భారాస నేత మన్నె క్రిశాంక్ అరెస్టు.. విడుదల

## సీఎం కుటుంబ సభ్యులపై ఆరోపణలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని కేసు..

## కోర్టులో హాజరుపరిచిన పోలీసులు.. బెయిల్ మంజూరు




హైదరాబాద్ పెన్ పవర్: సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులపై ఆరోపణలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని నమోదైన కేసులో భారాస నేత మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అరెస్టు చేయగా కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన విడుదలయ్యారు. సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి ఎదుట ఈనెల 4న సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులపై ఆరోపణలతో ఫ్లెక్సీలు వెలిశాయి. ముఖ్యమంత్రి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వీటిని ఏర్పాటు చేశారంటూ బోయిన్‌పల్లి సర్కిల్-3 డిప్యూటీ కమిషనర్ దాకు నాయక్ చేసిన ఫిర్యాదుతో భారాస నేత మన్నె క్రిశాంక్‌తోపాటు మరో ఆరుగురిపై గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేశారు. క్రిశాంక్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించి మంగళవారం కృష్ణానగర్‌కాలనీలోని ఆయన నివాసంలో అరెస్టు చేశారు.

వైద్య పరీక్షల అనంతరం సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు ఆవరణలోని 11వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. విచారించిన న్యాయస్థానం రూ.20 వేల

-5లో

- అనుకున్న సమయానికి ముందే పూర్తి చేస్తే రూ.90 లక్షల నజరానా..!
- ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తిచేసి..! లబ్ధిదారుల చేతికి తాళాలు..!
- శరవేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు..
- 5,218 మంది అర్హుల్లో లక్కీ డ్రా ద్వారా 480 కుటుంబాల ఎంపిక..!
- మరో మూడు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం..!
- నిర్మాణాల్లో వేగవంతంతో పాటు నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం..
- పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ప్రభుత్వం కార్యరూపం ఇస్తోంది..!




ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపనలో..

# ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు "స్పీడ్ బూస్ట్"..

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. రెవెన్యూ శాఖ మంత్రి..

-4లో



ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపనలో..


పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. రెవెన్యూ శాఖ మంత్రి..

# ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు "స్పీడ్ బూస్ట్"..

- అనుకున్న సమయానికి ముందే పూర్తి చేస్తే రూ.90 లక్షల నజరానా..!
- ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తిచేసి..! లబ్ధిదారుల చేతికి తాళాలు..!
- శరవేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు..
- 5,218 మంది అర్హుల్లో లక్కీడ్రా ద్వారా 480 కుటుంబాల ఎంపిక..!
- మరో మూడు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం..!
- నిర్మాణాల్లో వేగవంతంతో పాటు నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం..
- పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ప్రభుత్వం కార్యరూపం ఇస్తోంది..!

**కుత్బుల్లాపూర్ గాజులరామారంలో ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం చుట్టి, తొలి విడతలో 5,218 మంది అర్హుల నుంచి లక్కీడ్రా ద్వారా 480 కుటుంబాలను ఎంపిక చేసింది. ఏడాదిలోపే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి తాళాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది..పనులను ముందుగా పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు రూ.45 లక్షల నుంచి రూ.90 లక్షల వరకు ప్రోత్సాహక నగదును ప్రకటించింది. మరో మూడు విడతల్లో మరిన్ని ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రులు తెలిపారు..నిర్మాణ పనుల వేగవంతంతో పాటు నాణ్యతకు పెద్దపీట వేస్తూ.. పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 6:**

క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని, కాంట్రాక్టర్‌లకు చెప్పామని మంత్రి వివరించారు.. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలో ప్రయోగాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు.. ఏడాదిలోపే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.. ఈ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సహచర మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి శంకుస్థాపన చేశారు..

## 5,218 మందిలో 480 మందికి ఇళ్ల కేటాయింపు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు అందగా, అధికారుల పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు.. అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా బహిరంగ లక్కీడ్రా ద్వారా నిర్వహించి, తొలి విడతలో 480 కుటుంబాలను తుది లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు.. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికీ ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను కూడా అందజేస్తామని మంత్రి స్పష్టతను ఇచ్చారు..

## ముందే పూర్తి చేస్తే భారీ ప్రోత్సాహకం..

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించనుంది. ఏడాది గడువును నిర్మాణ సంస్థలకు నిర్దేశించినప్పటికీ, ఒక నెల ముందుగా పనులు పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలలు ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షల ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.. నిర్మాణ పనుల్లో వేగవంతంతో పాటు నాణ్యత విషయంలోనూ ఎక్కడా రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు..

లబ్ధిదారులకు ఇంటి ఎంపిక పత్రం అందజేస్తున్న మంత్రులు..




శంకుస్థాపనలో భాగంగా మంత్రి పొంగులేటి మట్టి తవ్వకాలు..

## ఇందిరమ్మ ఇళ్లతో పేదలు ధనవంతులు అవుతారు..

రూ.50 లక్షలకు పైగా ఇళ్ళ విలువ పెరగనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమలు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గాజులరామారంలో 480 ఇళ్లతో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు లోపల కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో భూముల ధరలు భారీగా ఉన్నప్పటికీ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత వాటి విలువ రూ.50 లక్షలకు పైగా చేరే అవకాశం ఉందని, తద్వారా పేదలు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. టవర్స్ సముదాయంలో ఆలయం, మసీదు, చర్చి వంటి ప్రార్థనా మందిరాలకు స్థలం కేటాయించే అంశాన్ని పరిశీలించాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. క్యూర్ పరిధిలో కాలుష్య పరిశ్రమలను తరలించి స్వచ్ఛమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆరు హామీల్లో ఇందిరమ్మ ఇళ్లు అత్యంత ప్రాధాన్యత కలిగిన పథకమని మంత్రి పేర్కొన్నారు.




దుద్దిళ్ల శ్రీధర్ బాబు.. తెలంగాణ మంత్రి..

## మూడు విడతల్లో మరిన్ని ఇళ్లు..

ప్రస్తుతం 480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపుతో ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమం ముగిసిందని మంత్రి తెలిపారు. మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనికి తోడు నియోజకవర్గ పరిధిలోని ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి పేదల కోసం మరిన్ని ఇళ్లను నిర్మించే చర్యలు చేపడతామని చెప్పారు.. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు..

## 23 నియోజకవర్గాల్లో నిరంతర ప్రక్రియ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు రాష్ట్రంలోని 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్‌ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.. కార్యక్రమంలో హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్, కలెక్టర్ మను చౌదరి తదితరులు పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు..



## లబ్ధిదారుల కళ్ల ముందే నిర్మాణం..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.. మీ కళ్ల ముందే మీ సొంతిళ్ళు నిర్మించబడాలి.. నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి, అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని పొంగులేటి అన్నారు..పేదల చిన్నచిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు.. పేదవాడి సొంతింటి కలను కేవలం హామీలకే పరిమితం కాకుండా కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు..

## 12వివాహితపై కానిస్టేబుల్ అత్యాచారం..
## వీడియోలతో బెదిరించి రూ.1.30 లక్షలు వసూలు

**జయశంకర్ భూపాలపల్లి: పెన్ పవర్:** పదో తరగతి నాటి పరిచయాన్ని ఆసరాగా చేసుకొని ఓ వివాహితపై టీజీఎస్పీ కానిస్టేబుల్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతేకాకుండా ఆ వీడియోలను రహస్యంగా చిత్రీకరించి బ్లాక్‌మెయిల్ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి తన భర్తతో కలిసి కరీంనగర్‌లో నివసిస్తోంది. ఆమెకు పదో తరగతిలో పరిచయమైన ఉదయ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని టీజీఎస్పీ ఎనిమిదో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పాత పరిచయంతో ఆమెతో తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. ఈ ఏడాది మార్చి 3న కరీంనగర్‌లో ఉదయ్ ఆమెపై అత్యాచారం చేశాడు. ఆ దృశ్యాలను రహస్యంగా చిత్రీకరించాడు. అనంతరం ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బెదిరిస్తూ పలుమార్లు లైంగికంగా వేధించాడు. అంతేకాకుండా వీడియోలను బయటపెడతానంటూ బెదిరించి ఈ ఏడాది ఆగస్టు 20, 21 తేదీల్లో తన నుంచి రూ.1.30 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు పంపిన తర్వాత కూడా నిందితుడి నుంచి వేధింపులు ఆగలేదు. యువతి ఇంటికి వచ్చిన ఉదయ్ గొడవ చేయడంతోపాటు తనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను భర్తకు పంపించాడు. అవి చూసిన భర్త, అతని కుటుంబసభ్యులు సదరు యువతిని ఇంటి నుంచి పంపించేశారు. గర్భిణీగా ఉన్న సమయంలో ఈ వేధింపుల కారణంగా గర్భస్రావం కూడా జరిగింది. ఈ ఘటనపై బాధితురాలు తొలుత జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఓ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును కరీంనగర్ గ్రామీణ పోలీసులకు బదిలీ చేశారు. దీంతో కరీంనగర్ గ్రామీణ పోలీసులు నిందితుడు ఉదయ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బౌరంపేట్ లో వృద్ధురాలు, పిల్లల పై కుక్కల దాడి

**కుత్బుల్లాపూర్: పెన్ పవర్:** బాలగారి భాషమ్మ అనే వృద్ధురాలు వాకిలి ఊడస్తుంటే వెనక నుండి వచ్చి ఒక్కసారిగా దాడి చేసిన వీధి కుక్కలు అవే కుక్కలు మధ్యాహ్నం ఆడుకుంటున్న పిల్లలపై మరోసారి దాడి చేసిందని తెలుసుకున్న గ్రామస్తులు వెంబడించి ఒక కుక్కను చంపేశారు.

బౌరంపేట్ లో అనేకమార్లు ప్రతి గల్లీ లో కుక్కల మందలు తిరుగుతున్నాయి వాటి వల్ల ప్రాణా హాని ఉందఅని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని అంటున్నారు

# ఇందిరానగర్ కాలనిలో పోలీసుల కర్టెన్ అండ్ సెర్చ్

**వికారాబాద్: పెన్ పవర్:** ప్రజలతో మమేకం కావడం కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తామని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనిలో పోలీసులు కర్టెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేని 50ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, భారీగా మద్యం, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొవడం తో పాటు అనుమతులు లేకుండా తయారు చేస్తున్న రసగుళ్ళ, తినుబండారాలు తయారు చేస్తున్న ప్యాక్టరిని గుర్తించారు. ఆ తినుబండారాల లో వాడే చిల్లీ పౌడర్ ఎక్స్ ఫైర్ డేట్ ను గుర్తించిన పోలీసులు తినుబండారాలు తో పాటు చిల్లీ పౌడర్ ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాలనీలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

## ఏటీఎంలో భారీ చోరీ

**హైదరాబాద్ పెన్ పవర్:** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ ఏటీఎం చోరీ కలకలం రేపింది. సాతం రాయ్‌లోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంను టార్గెట్ చేసిన దుండగులు గ్యాస్ కట్టర్లతో ఏటీఎం మిషన్‌ను కోసి సుమారు రూ.20 లక్షల నగదును దోచుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

తెల్లవారుజామున పక్కా స్కెచ్‌తో రంగంలోకి దిగిన దొంగలు.. ఏటీఎంలోని సీసీ కెమెరాలపై స్ప్రే కొట్టి, వైర్లను కట్ చేసి ఆధారాలు లేకుండా చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం గ్యాస్ కట్టర్లతో ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు.

ఏటీఎం వద్ద నైట్ వాచ్‌మన్ లేకపోవడం దొంగలకు కలిసొచ్చినట్లు తెలుస్తోంది. ఘటన వెలుగులోకి రావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు.

సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను పరిశీలిస్తూ దొంగల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఈ చోరీ వెనుక స్థానికుల ప్రమేయం ఉందా? లేక పక్కా రెక్కీ నిర్వహించిన ముఠా పనేనా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# వెంకీ ఆదర్శ కుటుంబం మళ్లీ వాయిదా

**హైదరాబాద్,అక్టోబరు 6, పెన్ పవర్:** అనుకున్నదే అయ్యింది. నిన్నటి నుంచి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నిజమైంది. విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబో ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఆదర్శ కుటుంబం మళ్లీ వాయిదా పడింది. ఈ విషయాన్ని నిర్మాత నాగవంశీ అఫీషియల్‌గా వెల్లడించారు.పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ డిలే కావడం వల్ల తప్పని పరిస్థితుల్లో 'ఆదర్శ కుటుంబం' రిలీజ్ వాయిదా వేస్తున్నట్లు చెప్పారు నాగవంశీ. 'నిన్నటి నుంచి సోషల్ మీడియాలో మాపై కామెంట్స్ చేస్తున్నారు. చెప్పిన టైంకు వస్తుందనే నేనే ట్వీట్ చేశా. కానీ తప్పని పరిస్థితుల్లో ఆదర్శ కుటుంబం వాయిదా వేయాల్సి వస్తోంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ నాలుగైదు రోజులు డిలే అవుతూ ఉండడం వల్ల వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నాం.అన్నీ పర్ఫెక్ట్‌గా ఉన్నప్పుడు.. సినిమా కాపీ చూశాక టీం ఔజు ూ=జు ఎజు్= న్యూూ్ అనుకున్నాకే ప్రొడక్ట్ బయటకు ఇస్తాం. క్వాలిటీ అవుట్ పుట్ ఇచ్చేందుకు టైం తీసుకున్నా పర్వాలేదనే ఈ నిర్ణయం తీసుకున్నాం. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాం.' అని చెప్పారు.తొలుత ఈ మూవీని అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ఆ తేదీ నుంచి అక్టోబర్ 9కి వాయిదా వేశారు. మరోసారి కూడా పోస్ట్ పోన్ కావడంతో మళ్లీ ఎప్పుడు వస్తుందా? అనే ఆసక్తి అందరిలోనూ ఉంది. వెంకీ, త్రివిక్రమ్ కాంబో అంటేనే ఫుల్ ఎనర్జీ, ఫన్ కన్ఫర్మ్. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, సాంగ్ ట్రెండ్ అవుతున్నాయి.మూవీలో చిట్టిబాబు పాత్రలో వెంకీ నటిస్తుండగా ఆయన భార్యగా శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. వీరితో పాటే యువినా పార్థవి, రాజా ప్రజ్వల్, పోలీస్ ఆఫీసర్‌గా నారా రోహిత్, రఘుబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. అలాగే, కీలకపాత్రలో నివేదా పేతురాజ్, రావు రమేశ్, సత్య తదితరులు నటించారు. మ్యూజిక్ లెజెండ్ తమన్ మ్యూజిక్ అందిస్తుండగా... హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ఆయన అన్నయ్య కుమారుడే నాగవంశీ.ఓ చిన్న ఉద్యోగంతో ఫ్యామిలీని నెట్టుకొచ్చే మిడిల్ క్లాస్ మ్యాన్ చిట్టిబాబు (వెంకటేశ్). తన భార్య (శ్రీనిధి శెట్టి) చేసే అప్పులతో ఇబ్బందులు పడుతుంటాడు. అలాంటి చిట్టిబాబు ఫ్యామిలీ అనుకోకుండా 'హౌస్ నెం 47' విల్లాలోకి షిఫ్ట్ అవుతుంది. ఆ తర్వాతే వారికి ఊహించని ప్రమాదం ఎదురవుతుంది. దీంతో తన ఫ్యామిలీని కాపాడుకునేందుకు మిడిల్ క్లాస్ మ్యాన్ ఏం చేశాడు? అసలు అతని బ్యాగ్రౌండ్ ఏంటి? అప్పుల ఊబి నుంచి తన ఫ్యామిలీని ఎలా కాపాడుకున్నాడు? అనేదే స్టోరీ.

# 22-ఏ నుంచి ఈ సర్వే నెంబర్లు 107, 49 తొలగించండి..

## -సురారం కాలనీ ప్రజల సమస్యను మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే..

- మాజీ కార్పొరేటర్లు జి.సురేష్ రెడ్డి, జగన్ సత్యనారాయణ..
- 22-ఏ జాబితా నుంచి సురారం కాలనీ భూములకు విముక్తి కల్పించాలని వినతి.!
- సర్వే నెంబర్లు 107, 49తో ప్రజలకు తీరని తిప్పలు.. మంత్రి పొంగులేటికి వివరణ..
- 22-ఏ జాబితాతో సురారం వీకర్ సెక్షన్ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు..



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 6:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సురారం కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే.పి.వివేకానంద, మాజీ కార్పోరేటర్ సురేష్ రెడ్డి, సత్యనారాయణ, జగన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేశారు.. సురారం కాలనీ లోని సర్వే నెంబర్లు 107, 49 ప్రస్తుతం 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితాలో ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.. ఈ రెండు సర్వే నంబర్లను 22-ఏ జాబితా నుంచి తక్షణమే తొలగించి, అక్కడి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.. ఈ 22-ఎ నిబంధనలతో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు.. సురారం కాలనీలోని సర్వే నంబర్లు 107, 49లను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, నిషేధిత జాబితాలో ఈ భూములు ఉండటంతో స్థానిక ప్రజలు తమ ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, లావాదేవీలు తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.. ప్రజల సమస్యను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.. స్థానిక మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్‌రెడ్డితో పాటు మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, బీఆర్ఎస్ నేత ఎం.డి.రఫీ పాల్గొన్నారు.. సురారం కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, 22ఏ జాబితా నుంచి సర్వే నంబర్లు 107, 49లను తొలగించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.. ప్రజల ఆస్తులకు సంబంధించిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, సురారం కాలనీ ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సమస్యను పరిష్కరిస్తుందని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చినట్టు మాజీ కార్పోరేటర్ జి.సురేష్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజల నెత్తిన కరెంటు ఛార్జీల భారమా?

-3 పేజి తరువాయి

ఆ కాల్పుల ఘటన చూసి.. కరెంట్ కష్టాలకు చరమగీతం పాడాలని.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం రావాలని.. తన పదవులకు కేసీఆర్ రాజీనామా చేసి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.కేసీఆర్.. అధికారంలోకి రాగానే విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేశారు. 2016-17 నుంచి 2021-22 వరకు ట్రూ-అప్ ఛార్జీలు రూ.12,718.40 కోట్లు వేయాలని ఈఆర్సీ చెప్పినా.. ఆ భారాన్ని వినియోగదారులపై మోపేందుకు అనుమతించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది. ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడంలో రేవంత్ సర్కారు విఫలమైంది. ప్రభుత్వం.. నిర్లక్ష్యంతో విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి.. ఆ భారాన్ని ప్రజలపై వేస్తోంది. దీన్ని భారాస తీవ్రంగా ఖండిస్తోంది. ప్రభుత్వం ఈ నిర్ణయం నుంచి వెనక్కు తగ్గాలి. లేకపోతే.. పెద్దఎత్తున ప్రజాఉద్యమానికి శ్రీకారం చుట్టాలని భారాస అధినేత కేసీఆర్ నిర్ణయించారు" అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ పోరాటంలో కలిసి రావాలని సీపీఐ, సీపీఎంలను కోరుతున్నామని తెలిపారు.

# భారాస నేత మన్నె క్రిశాంక్ అరెస్టు.. విడుదల

-3 పేజి తరువాయి

చొప్పున ఇద్దరి పూచీకత్తుపై క్రిశాంక్‌కు బెయిల్‌ను మంజూరు చేసింది. ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, మాధవరం కృష్ణారావు, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గ్యాదరి కిశోర్, భారాస నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు న్యాయస్థానం ఆవరణలో క్రిశాంక్‌ను కలిసి సంఘీభావం తెలియజేశారు. అనంతరం క్రిశాంక్ మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటానని తెలిపారు. ఇదే కేసులో పోలీసులు ముగ్గురికి నోటీసులు ఇవ్వగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

**నోటీసులిచ్చాకే చర్యలు తీసుకోవాలి: హైకోర్టు**

మన్నె క్రిశాంక్‌పై నమోదైన మరో కేసులో చట్టప్రకారం నోటీసులు జారీ చేశాకే చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఆర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసు జారీ చేయాలని ఆదేశించింది. సీఎం రేవంత్‌రెడ్డి కుమార్తెకు వ్యతిరేకంగా ఆమెకు ఫార్మస్యూటికల్ కంపెనీల్లో యాజమాన్య హక్కులున్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంపై పీసీసీ మత్స్యకారుల కాంగ్రెస్ కమిటీ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ ఈనెల 5న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. ఈ కేసులో అరెస్ట్ చేసే అవకాశాలుండటంతో క్రిశాంక్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవీదేవి నోటీసులు జారీ చేశాకే చర్యలు తీసుకోవాలని పోలీసులకు, దర్యాప్తునకు సహకరించాలంటూ పిటిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

# రాజ్యాంగాన్ని అపహాస్యం చేయకండి రాహుల్

## 'ఎక్స్'లో కాంగ్రెస్ అగ్రనేతకు కేటీఆర్ పోస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** 'రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతుంటే..మీరు దేశమంతటా రాజ్యాంగ పరిరక్షణపై ప్రచారం చేస్తూ..ఆ రాజ్యాంగాన్ని అపహాస్యం చేయకండి' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. 'తెలంగాణలో ముఖ్యమంత్రి కుటుంబ అవినీతిని ఆధారాలతో ప్రశ్నించినందుకే భారాస నేత మన్నె క్రిశాంక్‌ను అరెస్టు చేశారు. మీరేమో దిల్లీలో రాజ్యాంగ పరిరక్షణ గురించి ఉపన్యాసాలు చేస్తుంటారు. మీరు ఎవరిపైనైనా నిరాధార ఆరోపణలు చేయొచ్చు కానీ..మా నాయకుడు ఆధారాలతో ప్రశ్నిస్తే జైలుకు పంపిస్తారా? ఇకనైనా తెలంగాణలో మీ పార్టీ ముఖ్యమంత్రి అప్రజాస్వామిక పాలనను నియంత్రణలో పెట్టండి' అని కేటీఆర్ పోస్ట్‌లో పేర్కొన్నారు.



**కానిస్టేబుల్ వైద్య ఖర్చుల్ని నేనే భరిస్తా: కేటీఆర్**

విధి నిర్వహణలో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై..సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెదక్ టౌన్ కానిస్టేబుల్ దావసోత్ శంకర్ వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని తానే భరిస్తానని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఆయన పూర్తిగా కోలుకునే వరకు వారి కుటుంబానికి అండగా ఉంటామని మంగళవారం 'ఎక్స్'లో ప్రకటించారు. 'కనీసం ఈ ఘటన తర్వాతైనా..కష్టపడి పనిచేసే సాధారణ పోలీసుల దుస్థితిపై ప్రభుత్వం కళ్లు తెరుస్తుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**మేర కులం తరపున పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేస్తాం**

**సమన్వయ సమావేశంలో జిల్లా సెక్రెటరీ బొడ్డు హరి గోపాల్ వెల్లడి**



**ఖమ్మం, పెన్ పవర్,అక్టోబర్ 6:**వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేర కుల సంఘం జిల్లా సెక్రెటరీ బొడ్డు గోపాల్ పిలుపునిచ్చారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశానికి మేర కుల సంఘం ప్రతినిధులను కూడా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంఘం కుల పెద్దలు సమావేశానికి హాజరై, ఈ నెల 12న జరగనున్న భూమిపూజ కార్యక్రమానికి మేర కులం తరపున పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని జిల్లా సెక్రెటరీ గోపాల్ తెలిపారు. సంఘంలోని సభ్యులు, కుల పెద్దలు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఆలయ నిర్మాణం ఆధ్యాత్మికంగా, సామాజికంగా ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అధ్యక్షులు నిమ్మల వెంకటేశ్వర్లు, సెక్రెటరీ బొడ్డు హరి గోపాల్, కోశాధికారి బొడ్డు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వాడపల్లి బిక్షపతి, మాజీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు సిద్ధిని పోసు తదితరులు హాజరయ్యారు.

# కులం, ఆదాయం సర్టిఫికెట్లకు రూ.3 వేలు.. ఫ్యామిలీ సర్టిఫికెట్‌కు రూ.5 వేలు..

**ధ్రువీకరణ పత్రాలకూ ముడుపులా?**

**తొర్రూరు అక్టోబర్ 6: పెన్ పవర్:** ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా అందించాల్సిన రెవెన్యూ శాఖ అధికారుల తీరుపై మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు ఫ్యామిలీ సర్టిఫికెట్ల జారీకి అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై హరిపిరాల గ్రామస్తులు తొర్రూరు తహసీల్దార్ గడిల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.గ్రామస్తుల ఆరోపణల ప్రకారం.. కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు, ఫ్యామిలీ సర్టిఫికెట్ల కోసం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు డబ్బులు అడుగుతున్నారని పేర్కొన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నా వివిధ కారణాలతో తిరస్కరించడం, అనంతరం సంబంధిత కార్యాలయాలను ఆశ్రయిస్తే డబ్బులు చెల్లించిన తర్వాత పనులు పూర్తవుతున్నాయని వాపోయారు. కొన్ని సందర్భాల్లో సర్టిఫికెట్లపై సంతకాల కోసం కూడా డబ్బులు అడుగుతున్నారని ఆరోపించారు.హరిపిరాల, కర్కాల గ్రామాలకు జీపీఓగా
పనిచేస్తున్న గాదరబోయిన అచ్చయ్యపై గతంలోనూ ఫిర్యాదులు వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. తాజాగా హరిపిరాల గ్రామస్థులు ఆయనను మార్చాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తులను తిరస్కరించడం, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం, అనంతరం డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలపై విచారణ చేపట్టాలని కోరారు.
హరిపిరాల గ్రామానికి చెందిన మిట్టకోల అశోక్ తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. తన పెద్దనాన్న మిట్టకోలా నారాయణకు సంబంధించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో రూ.2 వేలు తీసుకున్నారని, అనంతరం ఫోన్‌పే ద్వారా మరో రూ.వెయ్యి పంపించినట్లు చెప్పారు.

అయినప్పటికీ ఇప్పటివరకు ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ కాలేదని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించి సర్టిఫికెట్ ఇప్పించాలని ఉన్నతాధికారులను కోరారు. జీపీఓ గాదరబోయిన అచ్చయ్యపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిస్తామని తొర్రూరు తహసీల్దార్ గడిల శ్రీనివాస్ తెలిపారు.

గతంలోనూ ఆయనపై ఫిర్యాదులు తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ సేవల విషయంలో అక్రమాలకు, అవకతవకలకు తావు లేదని స్పష్టం చేశారు. ప్రజల నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు హరిపిరాల జీపీఓను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

# హిజ్రాల దందాలో పురుషులు...

**హైదరాబాద్, అక్టోబరు 6, పెన్ పవర్:**
హైదరాబాద్: నగరంలో బహిరంగ ప్రదేశాల్లో డబ్బులు డిమాండ్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. తాజాగా జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఓ దీవీఔ కారును అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసుల దృష్టికి వెళ్లింది.పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు మహిళల మాదిరిగా చీరలు ధరించి, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల వేషధారణలో రోడ్డుపైకి వచ్చారు. అనంతరం జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఓ దీవీఔ కారును అడ్డుకుని అందులో ఉన్న వ్యక్తి నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నలుగురు కలిసి కారును అడ్డుకోవడంతో వాహనదారుడు ఇబ్బందికి గురైనట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది.ఈ వీడియోపై స్పందించిన పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు. అనంతరం కారును అడ్డుకున్న నలుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో వారు పురుషులేనని, డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశంతో మహిళల మాదిరిగా దుస్తులు ధరించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.హైదరాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్, మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో డబ్బులు అడుగుతున్న కొందరి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు గతంలోనూ వచ్చాయి. కొన్నిసార్లు డబ్బులు ఇవ్వకపోతే ఒత్తిడి చేయడం, వాహనాలను అడ్డుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఫిర్యాదు చేస్తున్నారు.ఇటీవల ఓ గృహప్రవేశ కార్యక్రమానికి వెళ్లిన కొందరు వ్యక్తులు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసిన ఘటన కూడా చర్చనీయాంశంగా మారింది. ఒక మహిళను ఇబ్బంది పెట్టి రూ.50 వేల వరకు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇలాంటి ఘటనలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలనే డిమాండ్లు పెరిగాయి.అయితే ఈ ఘటనలను మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికి ఆపాదించకూడదని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. చట్టవిరుద్ధంగా డబ్బులు వసూలు చేసే వ్యక్తులపై వారి లింగ గుర్తింపుతో సంబంధం లేకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.జూబ్లీహిల్స్ ఘటనలో నలుగురి అరెస్టుతో మరోసారి నగరంలో బహిరంగ ప్రదేశాల్లో డబ్బుల వసూళ్ల అంశం చర్చకు వచ్చింది. ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా వాహనాలను అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడటం వంటి చర్యలను సహించబోమని పోలీసులు స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. వైరల్ వీడియో ఆధారంగా ప్రారంభమైన ఈ కేసులో తదుపరి దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ప్రతిపక్షం స్థాయికి కాక్రోచ్ లు

**న్యూఢిల్లీ అక్టోబరు 6, పెన్ పవర్:**
భారత జాతీయ రాజకీయాల్లో ప్రధాన ప్రతిపక్షాలు ఇతరులకు తోక పార్టీలుగా మారిన తీరు దేశ ప్రజాస్వామిక చరిత్రలోనే మునుపెన్నడూ చూడని విచిత్ర స్థితిని ఆవిష్కరిస్తోంది. వందేళ్లకు పైగా చరిత్ర, దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన నేపథ్యం ఉన్న కాంగ్రెస్ పార్టీ మొదలుకుని.. ప్రాంతీయ అస్తిత్వాలతో పుట్టుకొచ్చిన విపక్షాల వరకు అన్నీ నేడు స్వయంప్రకటిత కాక్రోచ్ జనతా పార్టీకి తోకలుగా మారిపోయాయి. ప్రజాసమస్యలపై స్వతంత్రంగా ప్రజలను కూడగట్టి ఉద్యమాలు నిర్మించే సత్తా నశించిపోవడంతో, సోషల్ మీడియా ఆధారిత కాక్రోచ్ బ్యాండ్‌వాగన్‌ను ఎక్కి తమ ఉనికిని కాపాడుకునేందుకు విపక్షాలన్నీ తహతహలాడుతున్నాయి. తాము అజెండా నిర్దేశించాల్సింది పోయి, ఒక అపరిపక్వ డిజిటల్ గ్రూప్ వెనుక దాక్కుని యాత్రలు, ధర్నాలు నిర్వహించడం ప్రధాన విపక్షాల రాజకీయ శూన్యతను స్పష్టంగా బయటపెడుతోంది.ఇటీవల ముంబైలోని శివాజీ పార్క్, దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికలుగా కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో జరిగిన నిరసనలను గమనిస్తే ఈ రహస్యం సులువుగానే అర్థమవుతుంది. ఎన్నికల సంఘంపై నిందలు వేయడమే ఏకైక పనిగా పెట్టుకున్న ఇండియా కూటమి పార్టీలు, నేరుగా తమ పార్టీ జెండాలతో బయటకు వస్తే ప్రజల్లో మైలేజ్ రాదని గ్రహించాయి. అందుకే సీజేపీ అనే బోర్డును ముందుంచి, తెరవెనుక నుంచి కాంగ్రెస్, ఆప్, లెఫ్ట్ తదితర విపక్షాలు ఈ ఉద్యమాలకు తెరతీశాయి. పేరుకు యువత, జెన్-జీ ఆందోళనలని సోషల్ మీడియాలో డబ్బా కొట్టుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బారికేడ్లను నెట్టి, పోలీసులతో ఘర్షణ పడుతూ అరెస్టులవుతున్న వారిలో అత్యధికులు ఆయా రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి, యువజన విభాగాల కార్యకర్తలేనన్నది బహిరంగ రహస్యం.వాస్తవానికి నేటి సరికొత్త తరం యువతకు తమ కెరీర్, నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు, స్టార్టప్‌లే ప్రధానం తప్ప.. ఇలాంటి రాజకీయ ముసుగుల కోసం నెలల తరబడి రోడ్లెక్కి నిరసనలు చేసే తీరిక, ఆసక్తి ఎంతమాత్రం లేవు. కేవలం కొందరు డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, సోషల్ మీడియా రీల్స్ సరదాతో వైరల్ అవుతున్న హైటెక్ ఆందోళనకారులను అడ్డం పెట్టుకుని, పార్టీల క్యాడర్‌ను తరలించి ఒక కృత్రిమ ప్రజా తిరుగుబాటును సృష్టించేందుకు విపక్షాలు పడరాని పాట్లు పడుతున్నాయి. ప్రస్తుతం దేశ రాజకీయ ముఖచిత్రంలో అసలైన ప్రధాన ప్రతిపక్షంగా కాక్రోచ్ లే వ్యవహరిస్తుండగా, పార్లమెంట్‌లో కూర్చున్న
కాంగ్రెస్ వంటి వ్యవస్థాగత పార్టీలన్నీ నామమాత్రపు డమ్మీ లుగా మిగిలిపోయాయి.కేంద్ర ప్రభుత్వాన్ని విధానపరంగా నిలదీయడంలో, పాలనాపరమైన వైఫల్యాలపై ప్రజల్లో బలమైన చర్చను లేవనెత్తడంలో అధికారిక విపక్షాలు ఘోరంగా చేతులెత్తేశాయి. తమ స్వయంకృతాపరాధాలతో ప్రజల విశ్వసనీయతను కోల్పోయి, ఇప్పుడు ఒక నాన్-పొలిటికల్, నాన్-సీరియస్ గ్రూప్ విసిరే ఎంగిలి రొట్టెల కోసం, వారు కల్పించే వేదికల మైలేజ్ కోసం వెంపర్లాడే దుస్థితికి దేశంలోని ప్రతిపక్షాలన్నీ దిగజారాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం తన ప్రధాన ప్రతిపక్ష పాత్రను అధికారికంగానే కాక్రోచ్ జనతా పార్టీకి రాసిచ్చేస్తే మంచిదేమో అన్న సెటైర్లు రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రజాక్షేత్రంలో ప్రజల నాడిని పట్టుకుని పోరాడే దమ్ము లేక, ప్రతీదానికీ ఈవీఎంలు, ఎన్నికల సంఘం అంటూ సాకులు వెతుక్కుంటూ కాలం గడిపే పార్టీలకు రాజకీయం చేయడం చేతకానట్లే.

## పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సీఐలు



**ఖమ్మం, పెన్ పవర్,అక్టోబర్ 6:** ఖమ్మం వన్‌టౌన్, రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలుగా నూతన బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు ఎం.డి. సాధిక్ పాషా, టి. కరుణాకర్‌లు బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన బాధ్యతలు, పోలీస్‌స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే అంశాలపై చర్చించారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సీపీ సూచించినట్లు తెలిపారు

## పీఏసీఎస్ చైర్మన్ దుర్గాప్రసాద్‌కు ఘన సన్మానం



పిఎసిఎస్ చైర్మన్ ను సన్మానిస్తున్న గౌడ సంఘం కులస్తులు

**గార్ల ,పెన్ పవర్, అక్టోబర్: 6** గార్ల పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్‌ను మంగళవారం గార్ల కల్లుగీత కార్మిక సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌కు శాలువా కప్పి సత్కరించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన కల్లుగీత సంఘం అధ్యక్షుడు కత్తి సురేష్‌గౌడ్‌ను దుర్గాప్రసాద్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గౌడ సంఘం అభివృద్ధి, కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘం సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి కృష్ణగౌడ్, టి. విజయరాముడు గౌడ్, టి. శ్రీనివాస్, గౌడ్ మండ రవి, గౌడ్ నల్లమాస వెంకన్న, కత్తి వెంకన్న గౌడ్ బుర్ర రాము సతీష్ మహేష్ , కత్తి శివ, తోడేటి నాగరాజు బి. సైదులు చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

**గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నడిచే అన్ని ఆర్టిసి బస్సుల్లో వికలాంగుల పాసులు అనుమతించాలి**

**అక్టోబర్ 8న ఆర్టిసి బస్సు భవన్ ముందు ధర్నా**



**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్ (అక్టోబర్ 06):**వికలాంగులకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనీ వికలాంగులకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు అన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్టిసి బస్సులలో వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 34 నెలలు పూర్తి అవుతున్న హామిని అమలు చేయలేదని అన్నారు. ఇప్పటికే మహిళా వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలులో ఉందని కేవలం పురుషులకు మాత్రమే అమలు చేయాల్సి ఉందని అన్నారు. జిల్లా స్థాయిలో డీలక్స్ బస్సుల్లో వికలాంగుల రాయితీ పాసులను అనుమతిస్తున్నారని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నడిచే ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో మాత్రం వికలాంగుల పాసులను అనుమతించడం లేదని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆర్డినరీ బస్సుల తక్కువ సంఖ్యలో తిరుగుతున్నాయని అలాంటప్పుడు వికలాంగులకు ఎలా ఉపయోగపడుతుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నడిచే అన్ని రకాల బస్సుల్లో వికలాంగుల పాసులు అనుమతించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు కోసం 34 నెలల నుండి వికలాంగులు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఆర్టిసిలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నడిచే అన్ని రకాల ఆర్టిసి బస్సుల్లో వికలాంగుల పాసులు అనుమతించాలని అక్టోబర్ 8న హైదరాబాద్ లోని బస్సు భవన్ ముందు జరిగే ధర్నాలో వికలాంగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# అప్పారావు కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల అండ

కష్టకాలంలో అండగా ఉంటాం.. కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తాం



అప్పారావు కుటుంబానికి నిత్య అవసర సరుకులు అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

**ఖమ్మం, పెను పవర్, అక్టోబర్ 6 :** ఏదులాపురం మున్సిపాలిటీ వరంగల్ క్రాస్ రోడ్డు 28వ వార్డుకు చెందిన కోసూరి అప్పారావు కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారుఈ సందర్భంగా అప్పారావు కుటుంబానికి ఆర్థిక సాయం అందించడంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కుటుంబానికి అవసరమైన సమయంలో కాంగ్రెస్ నాయకులు అండగా ఉంటారని, భవిష్యత్‌లోనూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్, నూకల రామ్మోహన్ రెడ్డి, కొట్టం శిరిషా రంజిత్ రెడ్డి, ప్రదుమ్న చారి, మిర్యాల నరుణ్ తేజ్, రెబ్బగొండ్ల గోపీ, అక్కినేపల్లి దేవయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి


మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్

**గార్ల, పెన్ పవర్ ,అక్టోబర్ : 6** ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డా. రవి రాథోడ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని వివిధ రికార్డులను పరిశీలించి, వైద్య సేవల నిర్వహణపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు.
అనంతరం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఆయన ప్రత్యేకంగా చర్చించి క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, కార్యక్రమాల పురోగతి తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా డా. రవి రాథోడ్ సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునేషన్ ఆఫీసర్ డాక్టర్ శివ మదర్ చిల్డ్రన్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విరాజిత మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనుమంతరావు డి పి హెచ్ ఎన్ సక్కుబాయి పిడిఎంఓ డాక్టర్ నవీన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జ్ఞాన సుందరి హెచ్ వి ప్రమీల ఎం ఎల్ హెచ్ పి ఎస్ నవ్య నందిని సుమతి గోపి ఏ ఎన్ ఎం ఎస్ ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ నిర్వహణ సీజ్ చేసిన వైద్య అధికారులు

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్: 6** మండల కేంద్రంలో అర్హత, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌పై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. బి. రవి రాథోడ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రైవేట్ వైద్య సంస్థలు, ల్యాబ్‌ల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హర్ష ల్యాబ్, శ్రీచక్ర ల్యాబ్, శ్రీరామ హాస్పిటల్‌ను తనిఖీ చేసి రికార్డులు, అనుమతి పత్రాలను పరిశీలించారు. అనంతరం టి. అశోక్ నిర్వహిస్తున్న క్లినిక్‌ను అధికారులు తనిఖీ చేశారు. క్లినిక్ నిర్వహణకు అవసరమైన అర్హతలు, అనుమతులు లేవని గుర్తించిన అధికారులు దానిని సీజ్ చేశారు.అర్హత, అనుమతులు లేకుండా వైద్య సేవలు అందించడం నిబంధనలకు విరుద్ధమని డీఎంహెచ్‌వో డా. బి. రవి రాథోడ్ తెలిపారు. అనుమతులు లేకుండా వైద్య సంస్థలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే విధంగా నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఆస్పత్రులపై తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.



క్లినిక్ ను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్

# సుప్రియ మృతదేహం స్వదేశానికి.. ఎంపీ చొరవ

రెండు రోజుల్లో మృతదేహాన్ని అప్పగించే అవకాశం

ఢిల్లీలో ఉండి ఎంబసీ అధికారులతో ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎంపీ

**ఖమ్మం, పెన్ పవర్,అక్టోబర్ 6 :** ఖమ్మం: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సింహాద్రినగర్‌కు చెందిన కొదుమూరు సుప్రియ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఖమ్మం ఎంపీ రామ సాయం రఘురాం రెడ్డి చేసిన ప్రయత్నాలకు స్పందన లభించింది. ఎంపీ పంపిన లేఖకు స్పందించిన అమెరికాలోని భారత కాన్సులేట్.. మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తరలించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది.

**రెండు రోజులుగా ఎంపీ ప్రత్యేక చొరవ**

సుప్రియ మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తీసుకురావాలని కోరుతూ ఎంపీ రామ సాయం రఘురాం రెడ్డి ఈ నెల 4న అమెరికా కాన్సులేట్‌కు మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అమెరికాలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపారు. హైదరాబాద్‌లోని ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ అధికారులతోనూ మాట్లాడి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.



**పోస్టుమార్టం పూర్తి.. ఎంబామింగ్ ప్రక్రియ**

ఎంపీ విజ్ఞప్తికి స్పందించిన అమెరికాలోని భారత కాన్సులేట్ జనరల్ ఎం. ఆనంద్ ప్రకాశ్.. సుప్రియ పోస్టుమార్టం పూర్తయినట్లు తెలిపారు. అమెరికా అధికారులు మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయడంతో పాటు ఎంబామింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని, రెండు రోజుల్లో మృతదేహాన్ని అప్పగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు అవసరమైన రవాణా ఏర్పాట్లను కాన్సులేట్ సులభతరం చేయనుంది.

**కుటుంబ సభ్యులకు ఎంపీ భరోసా**

సుప్రియ భర్త కొదుమూరు రంజిత్‌తో కాన్సుల్ జనరల్ మాట్లాడి సానుభూతి తెలిపారు. సంబంధిత కాన్సులేట్ అధికారి ఫోన్ నంబర్‌ను ఆయనకు అందజేశారు. మరోవైపు ఎంపీ రామ సాయం రఘురాం రెడ్డి సోమవారం సుప్రియ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగిస్తామని వారికి భరోసా ఇచ్చారు.


Kind attention:

Shri R. Raghuram Reddy,

Hon'ble MP (Lok Sabha), Khammam.

Dear Sir,

Kindly refer to your letter dated 4 October 2026 regarding repatriation of mortal remains of Mrs. Kodumuru Supriya, who died in an accident in Missouri, USA.

2. The Consulate is in touch with the family of the deceased as well as with local Indian community regarding repatriation formalities. I also spoke with Shri Kodumuru Ranjith and conveyed deep condolences to him on the tragic demise of his wife. I have assured him of all possible help in the process.

3. Autopsy of the body has been done. The US authorities will issue a death certificate and handover the body after embalming it. We are expecting it to be done in two days' time while we are trying to expedite it. The Consulate will facilitate further transport of the mortal remains. Mobile number of the Consulate official has been shared with Shri Ranjith for ease of coordination.

Warm regards,

M. Anand Prakash
Consul General of India
Chicago
Tel. No. – 312-595-0412

# నవరాత్రులు ప్రశాంతంగా ముగియడంలో జర్నలిస్టుల సహకారం అభినందనీయం

- 112 సేవలతో నేరాల నియంత్రణకు మరింత బలం
- వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పాటించాలి
- ప్రతి ఇంటికీ సీసీ కెమెరా.. ప్రజల భద్రతకు రక్షణ కవచం



**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్, (అక్టోబర్ 06):** ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగియడంలో పోలీసులతో పాటు స్థానిక జర్నలిస్టులు అందించిన సహకారం అభినందనీయమని డీసీపీ నారాయణ రెడ్డి అన్నారు. పండుగల సమయంలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పోలీసులకు సహకరిస్తూ వార్తల ద్వారా శాంతిభద్రతల పరిరక్షణకు జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. బోనాలు, నవరాత్రుల సందర్భంగా భారీగా ప్రజలు తరలివచ్చినప్పటికీ పోలీసుల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు డీసీపీ పేర్కొన్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా జర్నలిస్టులు వ్యవహరించడం వల్ల భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా అమలు చేయగలిగామని తెలిపారు. 112 అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత నేరాల నియంత్రణకు మరింత బలం చేకూరిందని డీసీపీ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే 112కు సమాచారం అందించాలని సూచించారు. సమస్యలను ముందుగానే పోలీసుల దృష్టికి తీసుకురావడం ద్వారా అనేక ఘటనలను నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

వాహనదారులు రహదారి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీసీపీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లు నడిపే వారు సీట్‌బెల్ట్ ధరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

**ప్రతి ఇంటికీ సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలి**

కాలనీల్లో, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు మరింత సహకరించవచ్చని డీసీపీ నారాయణ రెడ్డి తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతలో పోలీసులతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.
పోలీసులు--ప్రజలు--జర్నలిస్టులు సమన్వయంతో పనిచేస్తే ఇబ్రహీంపట్నం డివిజన్‌ను మరింత సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దవచ్చని డీసీపీ నారాయణ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఏసీపీ కెవిపి రాజు, సిఐలు మహేందర్ రెడ్డి ఫ్యూచర్ సిటీ సిఐ, మంచాల, యాచారం, మాడ్గుల సిఐలు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి: మల్ రెడ్డి రాంరెడ్డి


లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న మల్ రెడ్డి రాంరెడ్డి, పన్యాల జైపాల్ రెడ్డి

ఎల్బీనగర్ లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ఎల్బీనగర్, పెన్ పవర్, అక్టోబర్ 6:** సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేద ప్రజల అభివృద్ధే ఏకైక ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి సర్కారు నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎల్బీనగర్ ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో చేపట్టారు. కార్యక్రమానికి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మల్ రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు మరింత సులభమైన, పారదర్శకమైన రేషన్ సేవలు అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల విధానాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 15న అధికారికంగా ప్రారంభించారని గుర్తు చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు రేషన్ సేవలు మరింత సులభంగా అందడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమం, ప్రజల ఆత్మగౌరవం, ప్రతి కుటుంబానికి భరోసా అనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతి కుటుంబానికి భరోసాగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మెగావత్ గణేష్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి, మైనారిటీ సీనియర్ నాయకులు జానిమియా, నాయకులు అజయ్, కాలనీ వాసులు పెంటారెడ్డి, అధిక సంఖ్యలో లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

# భారీకేడ్లు దూకిన రాహుల్, అగ్రనేతలో ఊహించని మార్పు.. కాంగ్రెస్‌లో కొత్త జోష్!



కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అనుసరిస్తున్న తీరు ఇప్పుడు సర్వత్ర ఆసక్తి రేపుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆయన వ్యవహరిస్తున్న తీరు, ప్రత్యక్ష ఆందోళనల్లో ముందుండి నడిపిస్తున్న విధానం జాతీయ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలోని నిర్వాచన్ సదన్ వైపు సాగిన కవాతు సందర్భంగా రాహుల్ గాంధీ సంచలన రీతిలో స్పందించారు. పోలీసుల వలయాలను, భారీ బారికేడ్లను సైతం లెక్కచేయకుండా ఆయన ఏకంగా బారికేడ్ల పైకి ఎక్కి, చేతిలో త్రివర్ణ పతాకం పట్టుకుని నిరసన తెలపడం దేశవ్యాప్తంగా మీడియాలో ప్రధానాంశంగా మారింది. ప్రధాన ప్రతిపక్ష నేతగా, రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ రాహుల్ గాంధీ ఒక సామాన్య కార్యకర్తలా క్షేత్రస్థాయిలో పోలీసులను ఎదుర్కొన్న వైనం కాంగ్రెస్ కేడర్‌కు పూనకం తెప్పిస్తోందని అంటున్నారు. కేవలం పార్లమెంటరీ చర్చలు, ప్రసంగాలు, విమర్శలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై, ప్రభుత్వ విధానాలపై నేరుగా రోడ్డెక్కి పోరాడటమే తమ వ్యూహమని ఆయన ఈ ఘటన ద్వారా నిరూపించినట్లుగా భావిస్తున్నారు. బారికేడ్లపై ఆయన నిలబడి నినాదాలు చేస్తున్న దృశ్యాలు, పోలీసులతో వాగ్వాదానికి దిగిన తీరు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. 2014లో కేంద్రంలో అధికారం కోల్పోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ వరుస ఓటములతో తీవ్ర నిరాశానిస్పృహల్లో కూరుకుపోయింది. పార్టీని మళ్లీ పూర్వవైభవం దిశగా నడిపించేందుకు, శ్రేణుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు రాహుల్ గాంధీ గత కొన్నేళ్లుగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగానే చారిత్రాత్మక 'భారత్ జోడో యాత్ర' దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి మైలురాయిగా నిలిచింది. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వేలాది కిలోమీటర్ల మేర నడిచిన రాహుల్ ప్రజలతో మమేకమయ్యారు. రాహుల్ చేపట్టిన ఈ యాత్ర తర్వాతే దక్షిణాదిలో కర్ణాటక, తెలంగాణ, కేరళం రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెబుతున్నారు. భారత్ జోడో యాత్రతో ప్రారంభమైన రాహుల్ దూకుడు, ఆ తర్వాత నుంచి పార్లమెంట్ లోపల బయటా కూడా స్పష్టంగా కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. కేవలం ఎన్నికల వేళల్లోనే కాకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడిన ప్రతిసారీ తాను ముందుంటానని రాహుల్ సంకేతాలిస్తున్నారని చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనల సమయంలో ఏకంగా పోలీస్‌స్టేషన్ బయట బైఠాయించి మెరుపు ధర్నా చేయడం, ఇప్పుడు ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ నేరుగా రోడ్లపైకి వచ్చి పోరాడటం కాంగ్రెస్ అగ్రనేత శైలిలో వచ్చిన మౌలిక మార్పునకు నిదర్శనంగా పరిశీలకులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ, రాహుల్ గాంధీ ప్రదర్శిస్తున్న ఈ తెగువ కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతుండగా, అధికార బీజేపీకి మాత్రం ఇది రాజకీయంగా గట్టి సవాల్‌గా మారుతోందని విశ్లేషిస్తున్నారు.

# ఈ మూర్ఖుడిని వదిలించుకోవాలి.. ట్రంప్‌పై టాప్ -5 హాలీవుడ్ స్టార్స్ బుల్లెట్ల వర్షం!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కి హాలీవుడ్ ప్రముఖులంతా వ్యతిరేకంగా ఉన్నారు. వీలున్న ప్రతి వేదికపైనా అతడి పాలనను, విధి విధానాలను, విదేశాంగ విధానాలను తూర్పారబడుతున్నారు. ఇప్పటికే పలువురు స్టార్లు అతడిని తూలనాడుతూ బహిరంగ వేదికలపైనే శాపనార్థాలు పెట్టారు. పూర్తి వివరాల్లోకి వెళితే...

హాలీవుడ్ ప్రముఖ నటుడు, -అవెంజర్స్- ఫేమ్ మార్క్ రఫాలో తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. న్యూయార్క్ నగరంలో జరిగిన -హ్యాండ్స్ ఆఫ్ అవర్ ఓట్- ర్యాలీలో ఆయన మాట్లాడుతూ త్వరలో రానున్న మధ్యంతర ఎన్నికలు దేశ భవిష్యత్తుకు చాలా కీలకమని పేర్కొన్నారు. ఓటింగ్ హక్కులను పరిమితం చేయడానికి.. ఎన్నికలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని.. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ట్రంప్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలం వాడుతూ ఆయన్ను త్వరలోనే పదవి నుంచి సాగనంపాలని పిలుపునిచ్చారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ భద్రతా లోపాలు, సైబర్ సెక్యూరిటీ అంశాలపై ఆందోళన వ్యక్తం చేసిన రఫాలో... ఎలన్ మస్క్ ప్రమేయంపైనా హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు ఎలాంటి భయాలకు లోనుకాకుండా, ఐక్యంగా ఉండి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కాగా గతంలో పారామౌంట్-వార్నర్ బ్రదర్స్ విలీనంపై ఆయన చేసిన వ్యాఖ్యలు యూదు సంఘాల నుంచి తీవ్ర విమర్శలకు, యాంటీసెంటిజమ్ ఆరోపణలకు దారితీయగా.. రఫాలో ఆ ఆరోపణలను ఖండించిన సంగతి తెలిసిందే.

**నైతికత లేని నాయకుడు..!**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, నిర్ణయాలపై హాలీవుడ్‌లో మొదటి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతూనే ఉంది. ముఖ్యంగా ప్రముఖ నటులు రాబర్ట్ డి నిరో, జాన్ క్యూసాక్, జేమీ లీ కర్టిస్ , క్రిస్టినా ఆపిల్‌గేట్ వంటి స్టార్స్ ట్రంప్‌పై బహిరంగంగానే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్రంప్ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి, మానవ హక్కులకు తీవ్ర ముప్పుగా పరిణమించాయని వారు చాలా వేదికలపై మండిపడ్డారు. ఆస్కార్ గ్రహీత రాబర్ట్ డి నిరో అయితే ట్రంప్‌పై తీవ్ర పదజాలం ఉపయోగిస్తూ.. అతడికి నైతికత లేదని.. దేశ భద్రతను ప్రమాదంలోకి నెడుతున్నారని పలుమార్లు నిలదీశారు. అలాగే ఇతర స్టార్ల మాదిరిగానే -అవెంజర్స్- నటుడు మార్క్ రఫాలో తాజాగా ఓటింగ్ హక్కులు, పౌర స్వేచ్ఛ పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ ట్రంప్ పరిపాలనను తీవ్రంగా విమర్శించారు. ట్రంప్ అనుసరిస్తున్న నియంతృత్వ పోకడలను.. విదేశీ విధానాలను హాలీవుడ్ ప్రముఖులు తీవ్రంగా ఖండిస్తూ వస్తున్నారు. ప్రభుత్వ విధానాలపై గళం విప్పడం సెలబ్రిటీలుగా తమ బాధ్యతని వీరంతా భావిస్తున్నారు. భావప్రకటన స్వేచ్ఛను హరించేలా... ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసేలా ఉన్న ఏ నిర్ణయాన్నైనా తాము వ్యతిరేకిస్తామని ఈ స్టార్స్ స్పష్టం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా.. బహిరంగ సభల్లో ట్రంప్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ అమెరికన్ రాజకీయాల్లో నిత్యం చర్చనీయాంశంగా మారుతున్నారు.

# హెచ్1బీ డిమాండ్ తగ్గుదల.. భారత ఐటీకి ఎదురుదెబ్బా? కొత్త మలుపా?




అమెరికా వీసా అనగానే ఒకప్పుడు ప్రతీ టెక్ నిపుణుడి కళ్లలో ఒక ప్రత్యేకమైన కాంతి మెరిసేది. భారత్‌లో ఐటీ కొలువు సాధించడం.. కొన్నాళ్లకే హెచ్1బీ వీసాతో విదేశీ విమానమెక్కడం దశాబ్దాలుగా ఒక డ్రీమ్ రూట్‌లా సాగింది. కానీ కాలం మారింది.. కాలంతో పాటు సాంకేతిక ప్రపంచంలో సమీకరణాలూ మారిపోతున్నాయి. ఇటీవల వెలువడిన హెచ్1బీ రిజిస్ట్రేషన్ల పతనం కేవలం కొన్ని సంఖ్యల తగ్గుదల కాదు.. అది సుదీర్ఘకాలం నడిచిన ఒక శకానికి ముగింపు.. ఒక నూతన విప్లవానికి శ్రీకారం.

అంకెల వెనుక ఉన్న నిజాన్ని లోతుగా గమనిస్తే ఇది భారత ఐటీ దిగ్గజాలకు ఎదురుదెబ్బ మాత్రమే కాదని అర్థమవుతుంది. పాత ఆలోచనా ధోరణిని వీడి కొత్త రూపాంతరం చెందేందుకు లభించిన ఒక గొప్ప అవకాశం ఇది. సరిహద్దులు దాటి మనుషులను పంపడం కంటే సరిహద్దులతో సంబంధం లేని సాంకేతిక శక్తిని పెంపొందించుకోవడమే నిజమైన విజయమని టెక్ ప్రపంచం గుర్తించింది. స్థానిక ఇమ్మిగ్రేషన్ సవాళ్లను అధిగమిస్తూ అమెరికాలోనే స్థానిక ప్రతిభను ప్రోత్సహించడం.. మరోవైపు భారత్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడం ఈ నూతన వ్యూహంలోని అసలైన అంతరార్థం.

దీనికి తోడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ తెచ్చిన మార్పులు శ్రామిక శక్తి స్వరూపాన్నే మార్చివేశాయి. వందల మంది చేసే పనిని అత్యున్నత నైపుణ్యమున్న కొద్దిమంది బృందాలు పూర్తిచేస్తుంటే సామర్థ్యానికి సరికొత్త నిర్వచనం లభిస్తోంది. ఒకప్పుడు అమెరికా వెళ్తేనే కెరీర్ అనుకున్న యువతకు.. ఇప్పుడు సొంత గడ్డపైనే గ్లోబల్ ప్రాజెక్టులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో సత్తా చాటే కొత్త ద్వారాలు తెరుచుకుంటున్నాయి.తీరానికి చేరిన అల వెనక్కి వెళ్లేది దెబ్బతిని కాదు.. అంతకంటే పెద్ద కెరటమై మళ్లీ ముందుకు రావడానికే. భారత ఐటీ రంగానిదీ సరిగ్గా ఇదే ప్రయాణం. హెచ్1బీ వీసాలపై ఆధారపడటం తగ్గడం అంటే అమెరికాలో ఉనికి కోల్పోవడం కాదు..

పాత వ్యాపార మోడల్ స్థానంలో గ్లోబల్ లీడర్‌గా ఎదిగే కొత్త శకానికి నాంది పలకడం. భవిష్యత్తు అనేది మనం ఎక్కడ ఉన్నామనే దానిపై కాదు.. ఏ నైపుణ్యంతో ప్రపంచాన్ని నడిపిస్తున్నామనే దానిపై ఆధారపడి ఉంటుందని ఈ మార్పు స్పష్టం చేస్తోంది.

# భీమిలిలోనూ ఏడ్చేసిన సత్తిబాబు.. రాజకీయ దిగ్గజానికి ఏమైంది?



వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కన్నీరు పెట్టుకుంటున్న ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇటీవల కాలంలో బొత్స కుటుంబంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు ఆయనను తీవ్ర భావోద్వేగానికి గురిచేస్తున్నట్లు స్పష్టమవుతోందని అంటున్నారు. మనసులోని బాధను దిగమింగుకోలేక ఆయన కన్నీరు కారుస్తున్న వైనం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోందని చెబుతున్నారు. గత నెలలో బొత్స మేనల్లుడు, విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) టీడీపీలో చేరడాన్ని ఆయన తట్టుకోలేకపోయారని చెబుతున్నారు. ఆ తర్వాత జరిగిన కొన్ని వైసీపీ సమావేశాల్లోనూ బొత్స భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమైన సంగతి తెలిసిందే.

**బొత్స లెగసీ కోసం..**

ఇక తాజాగా, బొత్స కుమార్తె అనూష భీమిలి ఇంచార్జిగా బాధ్యతలు స్వీకరించిన వేళ కూడా ఆయన కన్నీరు పెట్టుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. తన రాజకీయ వారసురాలిగా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన అనూషను భీమిలి నియోజకవర్గానికి పరిచయం చేసేందుకు బొత్స ఆధ్వర్యంలో భారీ ఎత్తున కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి బొత్స కుటుంబ సభ్యులతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల వైసీపీ నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా బొత్స రాజకీయ లెగసీని కాపాడేలా అనూష ముందుకు వెళ్లాలని పలువురు నేతలు ఆకాంక్షించారు. మరోవైపు బొత్స సతీమణి, మాజీ ఎంపీ ఝున్సీలక్ష్మి సైతం తన కుమార్తెను రాజకీయంగా ఆదరించాలని కార్యకర్తలను కోరారు.

**ఏదీ నాటి దూకుడు**

సభ జరుగుతున్నంత సేపూ బొత్స పలుమార్లు తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు పరిశీలకులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. సాధారణంగా ఎంతో దూకుడు స్వభావంతో, రాజకీయ వ్యూహాలతో చెలరేగే బొత్సలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ సున్నిత మనస్తత్వం కనిపించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోందని చెబుతున్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ చెక్కుచెదరని ఓర్పు, నేర్పు ప్రదర్శించే బొత్సలో ఇప్పుడు ఆ బింకం సడలినట్లు కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవైపు ఆరోగ్యం సహకరించక విశ్రాంతి తీసుకోవాలని భావించిన ఆయన, ఇప్పుడు తన పిల్లల రాజకీయ భవిష్యత్తు కోసం మళ్లీ క్రియాశీలకం కావాల్సి వస్తోందని అంటున్నారు. అయితే, ఇటీవల ఆయన వ్యవహారశైలిని గమనిస్తే పూర్వపు దూకుడు కనుమరుగైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయాల్లో నేతల పార్టీ మార్పులు సర్వసాధారణమే అయినప్పటికీ, బొత్స మాత్రం ఈ పరిణామాలను తేలిగ్గా తీసుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా తాను అన్నివిధాలుగా ప్రోత్సహించి, రాజకీయంగా ఉన్నత స్థాయికి తీసుకువచ్చిన మేనల్లుడు చిన్న శ్రీను పార్టీ మారడాన్ని ఆయన కలలో కూడా ఊహించి ఉండరని, ఆ మానసిక క్షోభ నుంచే ఆయన ఇంకా బయటపడలేకపోతున్నారని సన్నిహితులు చెబుతున్నారు. ఈ కారణం చేతనే బొత్స ఇంటా, బయటా జరిగే కార్యక్రమాలలో తన ఆవేదనను అణుచుకోలేక బాహాటంగానే కన్నీటి పర్యంతమవుతున్నట్లు కనిపిస్తోందని చెబుతున్నారు.

# మళ్లీ ట్రెండింగ్ లో జయాబచ్చన్ వీడియోలు.. జర్నలిస్టుకు షాక్ ఇచ్చిన ఎంపీ!




సీనియర్ నటి, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయా బచ్చన్ మరోసారి జాతీయ మీడియాలో ప్రధాన వార్తాంశంగా నిలిచారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ ఢిల్లీలో విపక్షాలు నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో జయాబచ్చన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ మీడియా ప్రతినిధి ఆమెను ఇంటర్వ్యూ చేయడానికి ప్రయత్నించగా, నిరాకరించిన జయాబచ్చన్ సదరు మీడియా ప్రతినిధి మైక్రో ఫోన్ ను లాక్కునే ప్రయత్నం చేయడం వివాదాస్పదంగా మారింది. తనను ఏమీ అడగొద్దంటూ చెప్పిన జయాబచ్చన్ మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దూరంగా వెళ్లిపోవడంపై సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ జరుగుతోంది.ఢిల్లీలో విపక్షాలు నిర్వహించిన కార్యక్రమం కన్నా, ఎంపీ జయాబచ్చన్ ఒక జాతీయ మీడియా చానల్ ప్రతినిధితో దురుసుగా వ్యవహరించారన్న ప్రచారమే ఎక్కువగా జరుగుతోంది. నిరసనలకు హాజరైన జయాబచ్చన్ పక్కన ఓ వ్యక్తి ప్లకార్డులు ప్రదర్శించగా, అందులో ఏముందో చెప్పాలని మీడియా ప్రతినిధి కోరగా, జయా బచ్చన్ ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. సదరు జర్నలిస్ట్ మైక్రోఫోన్‌ను చేత్తో పక్కకు నెట్టేస్తూ.. 'పక్కకు జరుగు, నేను నీకు ఏమీ చెప్పను' అంటూ విసవిసా ముందుకు సాగిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో నిమిషాల్లో వైరల్ అవుతోంది.

**ఎప్పుడూ అదే తీరు?**

ఎంపీ జయా బచ్చన్ ఇలా సీరియస్ కావడం తరచూ జరుగుతోందని అంటున్నారు. ఆమె ఆగ్రహానికి మీడియా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు బలైపోతుంటారని చెబుతున్నారు. సీనియర్ నటిగా, రాజకీయ నాయకురాలిగా సెలబ్రెటీ హోదాలో ఉన్న జయాబచ్చన్ ఎప్పుడు ఎలా రియాక్ట్ అవుతారో అర్థం కాదని అంటున్నారు. దేశ అత్యున్నత సభ అయిన రాజ్యసభలో జయాబచ్చన్ చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. గతంలో రాజ్యసభ సమావేశాల సందర్భంగా అప్పటి చైర్మన్ జగదీప్ ధంఖర్‌తో జయబచ్చాన్ విభేదించడం హాట్ టాపిక్ అయింది. సభలో తన పేరును 'జయా అమితాబ్ బచ్చన్' అని పిలవడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తనకంటూ ఒక సొంత గుర్తింపు ఉందని, భర్త పేరును ప్రతిదానికీ జోడించాల్సిన అవసరం లేదని వాదించారు. అంతటితో ఆగకుండా, చైర్మన్ మాట్లాడిన తీరు (టోన్) సరిగ్గా లేదంటూ ప్రతిపక్ష సభ్యులతో కలిసి సభ నుండి వాకౌట్ చేయడం జాతీయ స్థాయిలో పెద్ద సంచలనమైంది.

**అభిమానులపైనా అదే కరకుదనం**

కెమెరా కంటికి చిక్కితే చాలు జయా బచ్చన్ అసహనం బయటపడుతుంటుందని చెబుతున్నారు. 2025 ఆగస్టులో ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన ఒక ఘటన దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా చూపుతున్నారు. ఒక అభిమాని ఆమెతో సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నించగా.. జయాబచ్చన్ తీవ్రంగా కోపగించుకున్నారు. 'ఏం చేస్తున్నారు మీరు? మర్యాద లేదా?' అంటూ ఆ అభిమానిని పక్కకు తోసేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అదేవిధంగా ముంబై విమానాశ్రయంలోను వివిధ ఫంక్షన్లలో ఫొటోగ్రాఫర్లు ఫొటోలు తీయడానికి ప్రయత్నించినప్పుడు.. 'మీకు సిగ్గులేదా?, మీరు పడిపోతారు' అంటూ శాపనార్థాలు పెట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయని అంటున్నారు.

**బాలీవుడ్ కోసం పార్లమెంటులో గర్జన**

2020 సెప్టెంబర్‌లో బాలీవుడ్‌లో డ్రగ్స్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తున్నప్పుడు జయా బచ్చన్ రాజ్యసభలో ఘాటుగా స్పందించారు. చిత్ర పరిశ్రమ ద్వారా లబ్ధి పొంది, ఇప్పుడు అదే పరిశ్రమను బద్నాం చేస్తున్నారంటూ కొందరు ఎంపీలను ఉద్దేశించి 'ఏ పాత్రలో తింటారో.. అదే పాత్రకు రంధ్రం చేస్తారు' (జిస్ థాలీ మే ఖాతే హై, ఉసీ మే ఛేద్ కర్తే హై) అంటూ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అయ్యాయి. సోషల్ మీడియా, మీడియా సంస్థలు బాలీవుడ్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయంటూ ఆమె జీరో అవర్ నోటీసు ఇచ్చి మరీ చిత్ర పరిశ్రమకు మద్దతుగా నిలిచారు.

కాగా, జయా బచ్చన్ వైఖరిపై దేశంలో ఎప్పుడూ రెండు రకాల వాదనలు వినిపిస్తుంటాయని పరిశీలకులు చెబుతున్నారు. సెలబ్రిటీలు, రాజకీయ నాయకులకు వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుందని ఒక వర్గం ప్రజలు జయాబచ్చన్ ను వెనుకేసుకువస్తున్నారు. అనుమతి లేకుండా ఫొటోలు తీయడం, ఇబ్బందికర ప్రశ్నలు అడగడం తప్పు అంటూ సమర్థిస్తుంటారు. అయితే, మెజారిటీ నెటిజన్లు మాత్రం ప్రజా జీవితంలో ఉన్నప్పుడు, ముఖ్యంగా ఒక ఎంపీగా ఉన్నప్పుడు అంతటి అహంకారం, దురుసు ప్రవర్తన పనికిరాదని కామెంట్లు చేస్తున్నారు. మీడియా అడిగే ప్రశ్నలకు సంయమనంతో సమాధానం చెప్పడం నేర్చుకోవాలని హితవు పలుకుతున్నారు. ఏదేమైనా, ఎప్పటికప్పుడు వివాదాల కేంద్ర బిందువుగా మారడం జయా బచ్చన్‌కు ఒక అలవాటుగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదని అంటున్నారు.

పదకొండేళ్లుగా పాకిస్తాన్ ఒకే ప్రశ్నను తప్పించుకుంటూ వచ్చింది: సౌదీ అరేబియా కోసం యుద్ధం చేస్తుందా? 2015 ఏప్రిల్‌లో పాక్ పార్లమెంటు ఏకగ్రీవంగా యెమెన్ విషయంలో తటస్థ వైఖరిని ఎంచుకుంటూనే, సౌదీ భూభాగానికి లేదా పవిత్ర స్థలాలకు ముప్పు వస్తే మద్దతిస్తామని ప్రకటించింది. ఆ సూత్రం ఇంతకాలం నిలబడిందంటే, ఎవరూ దాన్ని పరీక్షించకపోవడమే కారణం. ఇప్పుడు ఆ పరీక్ష మొదలైంది. ఈలోగా పాకిస్తాన్ రెండు రక్షణ ఒప్పందాలు కుదుర్చుకుంది. 2025 సెప్టెంబర్‌లో సౌదీతో కుదిరిన వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందం, ఏ ఒక్క దేశంపై జరిగే దాడినైనా రెండు దేశాలపైనా దాడిగా పరిగణిస్తుంది. ఈ ఏడాది ఆగస్టు 7న టర్కీతో కలిసి సంతకం చేసిన 'మక్కా సంయుక్త రక్షణ ఒప్పందం' ఇదే సూత్రాన్ని మూడు దేశాలకు విస్తరించింది. మరోవైపు, 2022 నాటి యెమెన్ కాల్పుల విరమణ జులైలో కుప్పకూలింది. సౌదీపై నౌకా దిగ్బంధాన్ని ప్రకటించిన హూతీలు, ఆ దేశ ట్యాంకర్లపై, చమురు కేంద్రాలపై దాడులు చేశారు. ఈ పరిణామాలపై ఇస్లామాబాద్ స్పందన ఇప్పటివరకూ ఆచితూచి సాగింది. సెప్టెంబర్ 10న హూతీలపై సైనిక చర్య ప్రస్తావనే లేదని విదేశాంగ శాఖ చెప్పగా, వారం తర్వాత సైన్యం ప్రతినిధి దౌత్యపరంగానే కాక "భౌతికంగా" కూడా రియాద్ పక్షాన నిలుస్తామన్నారు. అక్టోబర్ 2న కార్ప్స్ కమాండర్లు మక్కా ఒప్పందాన్ని సమర్థిస్తూ హూతీ దాడులను ఖండించారు. ఆ తర్వాత పరిణామాలు మరింత వేగంగా సాగాయి. అక్టోబర్ 5న రియాద్‌లో అత్యవసరంగా సమావేశమైన మక్కా కూటమి వ్యూహాత్మక రాజకీయ, రక్షణ కమిటీ, సామూహిక రక్షణ చర్యలను అమల్లోకి తెచ్చేందుకు, ముందే అంగీకరించిన బలగాలను, సైనిక సామర్థ్యాలను సౌదీకి త్వరగా తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ చర్యలు ఆమోదిత ఏర్పాట్లకు, ప్రతి సభ్యదేశపు జాతీయ చట్టాలకు లోబడే ఉంటాయని ప్రకటన పేర్కొంది. పాక్‌కు చెందిన రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ నౌమాన్ మహమూద్‌ను కూటమి తొలి ప్రధాన కార్యదర్శిగా మూడేళ్లకు నియమించారు.

ఇది పాక్‌కు నిజంగానే ఇరకాటమైన పరిస్థితి, ఎందుకంటే "అవును" అన్నా, "కాదు" అన్నా ఖరీదు తక్కువేమీ కాదు. "అవును" అంటే, హూతీల ప్రధాన పోషకుడైన ఇరాన్‌తో ముఖాముఖి తలపడాల్సి వస్తుంది. ఆ దేశంతో పాకిస్తాన్‌కు సుమారు 900 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. ఇస్లామాబాద్ నెలల తరబడి వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య మధ్యవర్తిత్వం నెరపుతోంది, ఇరాన్ వెలుపల అత్యధిక షియా జనాభా ఉన్న దేశాల్లో పాకిస్తాన్ ఒకటి. ఇస్లామాబాద్ వేదికగా కుదిరిన జూన్ 17నాటి ఒప్పంద పత్రం తర్వాత, ఇరుపక్షాల మధ్య సంధానకర్తగా తన పాత్రను పాక్ కాపాడుకోవాలనుకుంటోంది; ఇరాన్‌తో వైరం ఆ పాత్రనే ప్రమాదంలో పడేస్తుంది. భారత సరిహద్దు, తాలిబాన్ పాలిత ఆఫ్ఘనిస్తాన్ మధ్య సైన్యం ఇప్పటికే సాగిలబడి ఉంది, ఇమ్రాన్ ఖాన్ పార్టీ పీటీఐ ఇస్లామాబాద్‌పై నిర్వహిస్తున్న ర్యాలీ దేశీయ రాజకీయాలు ఏమాత్రం ప్రశాంతంగా లేవని చాటుతోంది. కార్ప్స్ కమాండర్లు మే 9 తరహా అల్లర్లపట్ల ఇప్పటికే హెచ్చరించారు కూడా. సౌదీ పక్షాన యుద్ధంలోకి దిగితే, పాక్ లోపలి మతపరమైన చీలిక రేఖలు మరింత లోతవుతాయన్న భయం అర్థం

## ఇరకాటంలో ఇస్లామాబాద్

చేసుకోదగినదే. పాకిస్తాన్‌లో సున్నీ, షియా వర్గాల మధ్య గతంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, ఒక పొరుగు మిత్రదేశంతో కలిసి ఒక మతపరమైన శిబిరం తరఫున యుద్ధం చేస్తున్నారన్న భావన వ్యాపిస్తే, తిరిగి తలెత్తే అవకాశాన్ని విస్మరించలేం. "కాదు" అనడం కూడా చౌక కాదు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పాక్ సైనికులు, యుద్ధ విమానాలు కింగ్ అబ్దులాజీజ్ ఎయిర్ బేస్‌లో ఉన్నారని, రియాద్‌లోని కూటమి సచివాలయానికి పాకిస్తానే నాయకత్వం వహిస్తోందని ఈ వ్యాసం సూచిస్తోంది. 2015లో పాక్ నిరాకరించినప్పుడే సౌదీతో సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రెండు ఒప్పందాలు, గట్టి హామీల తర్వాత వెనక్కి తగ్గడం దానికంటే ఎన్నో రెట్లు ఎక్కువ నష్టాన్ని తెస్తుంది. సౌదీ ఆర్థిక సాయం, అక్కడ పనిచేసే లక్షలాది పాక్ కార్మికులు పంపే డబ్బు, ఇంధన సరఫరాలు –ఇవన్నీ ఈ సంబంధంపైనే ఆధారపడి ఉన్నాయి.

ఈ సంకటం నుంచి బయటపడే మార్గం ఒక స్పష్టమైన తేడాను బహిరంగంగా గీయడమే: సౌదీ అరేబియాను రక్షించడం వేరు, యెమెన్‌లో యుద్ధం చేయడం వేరు. సౌదీ గగనతలాన్ని, స్థావరాలను, పవిత్ర స్థలాలను కాపాడటం ఒక నిబద్ధత అయితే, హూతీల భూభాగంపై దాడి చేయడం మరొకటి. పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కూడా ప్రస్తుతం హూతీలపై పోరాట చర్యల్లో సౌదీ బలగాలు మాత్రమే పాల్గొంటున్నాయని, పాక్, టర్కీ బలగాలు సహాయక పాత్రలో ఉన్నాయని చెప్పడం ఇదే తేడాను ప్రతిబింబిస్తోంది. అయితే దాడులు యెమెన్ నుంచే వస్తున్నందున ఈ రేఖ చాలా త్వరగా చెరిగిపోతుంది. గగనతల రక్షణ నౌకా భద్రతగా మారుతుంది, నౌకా భద్రత ప్రయోగ స్థావరాలపై దాడులుగా మారుతుంది. ఇలాంటి జారుడు మెట్ల మీద జాగ్రత్త అవసరం. 2015లో ఈ ప్రశ్నను తేల్చిన పాక్ పార్లమెంటు, ఏదైనా సైనిక మోహరింపు జరగడానికి ముందు మరోసారి దీన్ని చర్చించాలి. కూటమి ప్రకటన కూడా ప్రతి దేశపు జాతీయ చట్టాలకు లోబడే చర్యలని చెప్పడం ఈ పార్లమెంటరీ ఆమోదానికి ఆస్కారం ఇస్తోంది. ఒప్పందం అమలు వివరాలు గోప్యమని సైన్యం ప్రతినిధి చెప్పినప్పటికీ, దేశాన్ని యుద్ధంలోకి నెట్టగల నిర్ణయాల్లో కనీస పారదర్శకత ప్రజాస్వామ్య అవసరం; బలగాల సంఖ్య, పాత్ర, పరిమితులను పార్లమెంటుకు, ప్రజలకు స్పష్టంగా చెప్పాలి. అదే సమయంలో, రాజకీయ మార్గాన్ని కూడా పాక్ అనుసరించవచ్చు, హూతీలతో దౌత్యపరంగా సంప్రదింపులు జరపవచ్చు. రియాద్, టెహ్రాన్ రెండింటితోనూ మాట్లాడగలగడం ఇస్లామాబాద్‌కు ఉన్న అరుదైన ఆస్తి. సైనికులను ఖర్చు చేసే ముందు, ఆ ఆస్తిని మధ్యవర్తిత్వం కోసం వినియోగించాలి. ఇదే సమయంలో యెమెన్‌లో సౌదీ మద్దతున్న ప్రభుత్వం హూతీల అధీనంలోని ప్రాంతాలపై భారీ దాడిని ప్రారంభించింది, ఇది పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసే ప్రమాదముంది. ఈ మొత్తం పరిణామం భారత్‌కు కూడా ముఖ్యమైనదే. పాకిస్తాన్ పశ్చిమాసియా సంఘర్షణలో మరింత లోతుగా చిక్కుకుంటే, దాని సైనిక, ఆర్థిక దృష్టి చీలుతుంది, ఇది దక్షిణాసియా భద్రతా సమీకరణాలపై ప్రభావం చూపవచ్చు. చివరికి, ఒప్పందం అంటే శాంతికాలంలో చేసుకునే వాగ్దానం. తదుపరి క్షిపణి పడకముందే, ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి ఏమి చెల్లించడానికి సిద్ధంగా ఉందో పాకిస్తాన్ నిర్ణయించుకోవాలి!

### పనికొచ్చే పలుకు



## కెరీర్ అంటే స్ప్రింట్ కాదు ఎండ్యూరెన్స్ రన్!

"ఇన్‌స్టాలో ఓ అబ్బాయి 24 ఏళ్లకే స్టార్టప్ ఫౌండర్, నేనేమో ఇంకా జూనియర్ పొజిషన్‌లో ఉన్నాను." ఇలాంటి ఆలోచన మనసులో ఎప్పుడైనా మెదిలిందా? ఎవరో మూడు నెలల్లో ప్రమోషన్ తెచ్చుకున్నారని, ఇంకెవరో ఒక్క రీల్‌తో ఓవర్‌నైట్ సెలబ్రిటీ అయ్యారని చూసి, "నా కెరీర్ ఎందుకింత స్లోగా ఉంది?" అనుకుంటాం. కానీ అసలు నిజమేంటంటే, కెరీర్ అనేది పరుగు పందెం కాదు, అదొక మారథాన్. వేగం కాదు, నిలకడే గెలుపును నిర్ణయిస్తుంది.

మ్యూచువల్ ఫండ్స్ గురించి విన్నారా? ఎస్ఐపీ అంటే నెలనెలా చిన్న మొత్తం పెట్టుబడి పెట్టడం. మొదటి ఏడాది ఫలితం పెద్దగా కనిపించదు, రెండో ఏడాదీ అంతంతమాత్రమే. కానీ పదేళ్ల తర్వాత చూస్తే, కాంపౌండింగ్ మ్యాజిక్ మొదలవుతుంది. మీ కెరీర్ కూడా అంతే. ప్రతిరోజూ మీరు నేర్చుకునే కొత్త స్కిల్, ప్రతి ప్రాజెక్ట్‌లో పడే శ్రమ, ప్రతి సవాలు నుంచి మీరు తెచ్చుకునే పాఠం –ఇవన్నీ మీ "కెరీర్ పోర్ట్‌ఫోలియో"లో చిన్న చిన్న డిపాజిట్లు. తక్షణ రిటర్న్స్ ఉండవు, కానీ సమయం గడిచే కొద్దీ పెట్టుబడి ఊహించనంత పెద్దదవుతుంది. మీరు ఎంత ఎక్కువ సమయం, శ్రమ పెట్టుబడిగా పెడితే, రిటర్న్స్ అంత గొప్పగా ఉంటాయి.

చాలామంది కెరీర్ ఆరంభంలో ఒక తప్పు చేస్తారు: "ముందు నాకు ఏం కావాలో క్లారిటీ వస్తే, తర్వాత పనిలోకి దిగుతాను" అనుకుంటారు. కానీ నిజానికి క్లారిటీ ఆలోచనల నుంచి రాదు, అనుభవం నుంచి వస్తుంది. ఒక ఉద్యోగంలో ఏడాది పనిచేస్తేనే, మీకు ఏ పని నచ్చుతుందో, ఏది కాదో తెలుస్తుంది. ఒక కొత్త స్కిల్ నేర్చుకుంటూ ఉంటేనే, మీ బలాలు ఏమిటో బయటపడతాయి. ఇది ఒక జీపీఎస్ లాంటిది. మీరు కదలడం మొదలుపెట్టకపోతే, అది మీకు సరైన దారి చూపించలేదు. కదులుతూ ఉంటేనే, "ఇటు తిరగండి, అటు వెళ్లండి" అని మార్గదర్శనం ఇస్తుంది. అలాగే, ఎంత ఎక్కువ శ్రమ పెడితే, మీ లక్ష్యాలపై స్పష్టత అంతగా పెరుగుతుంది.

ఇన్‌స్టాగ్రామ్ మోటివేషనల్ కోట్స్ చదివితే ఆత్మవిశ్వాసం రాదు. అది ఎలా వస్తుందంటే, మీరు ఒక కష్టమైన పనిని పూర్తి చేసినప్పుడు, "అరే, ఇది కూడా చేయగలిగాను" అనే అనుభూతి నుంచి. ప్రతి చిన్న విజయం, మీపై మీకు నమ్మకాన్ని పెంచే ఒక ఇటుకలాంటిది. ఆ ఇటుకలు పేరుకుపోయే కొద్దీ, మీరు కొత్త సవాళ్లకు భయపడరు. ఇంటర్వ్యూల్లో, మీటింగ్స్‌లో, కొత్త ప్రాజెక్టుల్లో మీరు ఇచ్చే ఆత్మవిశ్వాసం, మీ ప్రతిభ కంటే మీ శ్రమ చరిత్ర నుంచే పుడుతుంది.

"అతనికి లక్ ఉంది, అందుకే మంచి ఛాన్స్ దొరికింది" అని అంటుంటాం. కానీ గమనించండి –అవకాశాలు సాధారణంగా ఎక్కువ కాలంగా శ్రమిస్తున్నవాళ్లనే వెతుక్కుంటూ వస్తాయి. ఎందుకంటే, మీరు ఎంత ఎక్కువకాలం, ఎంత నాణ్యంగా పనిచేస్తే, అంతమందికి మీ పని కనిపిస్తుంది, అంతమందికి మీరు గుర్తుంటారు. ఒక మంచి మేనేజర్, ఒక సహోద్యోగి, ఒక క్లయింట్ –వీళ్లంతా మీ గురించి ఇతరులకు చెబుతారు. ఇదే "నెట్‌వర్కింగ్ ఎఫెక్ట్". ఇందుకే దీర్ఘకాలం పెట్టుబడి పెట్టేవాళ్లకు అవకాశాలు సహజంగా లభిస్తాయి.

చివరిగా ఒక మాట

కెరీర్ ఒక్క రాత్రిలో నిర్మించేది కాదు, అది ఇటుక ఇటుకగా కట్టే భవనం. మీరు ఎంత సమయం, శ్రమ ఇందులో పెట్టుబడిగా పెడితే, ఆ భవనం అంత బలంగా, ఎత్తుగా ఉంటుంది. కాబట్టి ఇవాళ మీరు పెట్టే ప్రతి చిన్న ప్రయత్నాన్ని తక్కువగా చూడకండి. అది ఇప్పుడు కనిపించకపోవచ్చు, కానీ రాబోయే సంవత్సరాల్లో అదే మీకు స్పష్టతను, ఆత్మవిశ్వాసాన్ని, కొత్త అవకాశాలను తెచ్చిపెట్టే పునాదిగా మారుతుంది. పరుగు ఆపకండి, ఎందుకంటే ఈ మారథాన్‌లో గెలిచేది వేగంగా పరుగెత్తేవాడు కాదు, ఆపకుండా పరుగెత్తేవాడు!

# పతకాలు తగ్గాయి.. ప్రశ్నలు పెరిగాయి!

ఒలింపిక్స్ ఆతిథ్యం కలలు కంటున్న భారత్‌కు, ఐచీ–నగోయా ఆసియా క్రీడలు ఒక కఠినమైన అద్దం చూపించాయి. హాంగ్జౌలో 106 పతకాలు సాధించిన దేశం, ఈసారి 85తో సరిపెట్టుకుంది, వంద పతకాల లక్ష్యం అందలేదు. స్వర్ణాలు 28నుంచి 21కి పడిపోయాయి. చివరి రెండు రోజుల్లో వచ్చిన 11 స్వర్ణాలే పరువు కాపాడాయి. క్రికెట్, కబడ్డీ, హాకీ జట్లు మెరిశాయి, కానీ ఈత, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్‌వంటి వ్యక్తిగత క్రీడల్లో భారత్ ఎక్కడా కనిపించలేదు. ఒక్క ఈతలోనే చైనా 54 పతకాలు గెలిచింది, మనం ఆ పోటీ దరిదాపుల్లోకి కూడా రాలేకపోయాం. వెలుగులూ లేకపోలేదు –17 ఏళ్ల విలుకత్తె కుంకుమ్ మొహద్ నుంచి 44 ఏళ్ల తర్వాత స్వర్ణం గెలిచిన మహిళా హాకీ జట్టు వరకు. కానీ పునాది బలపడకుండా ఒలింపిక్ బిడ్ వేస్తే, ఆ కల అంతర్జాతీయ ఇబ్బందిగా మారవచ్చు!



2036 ఒలింపిక్ క్రీడల ఆతిథ్యాన్ని ఆశిస్తున్న భారత్‌కు, ఐచీ–నగోయా ఆసియా క్రీడలు ఒక కఠినమైన వాస్తవ పరీక్షగా మారాయి. గత హాంగ్జౌ క్రీడల్లో 650కి పైగా క్రీడాకారుల బృందంతో 106 పతకాలు సాధించిన భారత్, ఈసారి దాదాపు 500మంది అథ్లెట్లతో 85 పతకాలకే పరిమితమైంది. మొత్తం 21 స్వర్ణ, 27 రజత, 37 కాంస్య పతకాలతో నాలుగో స్థానంలో నిలిచినా, ఈ సంఖ్య అంతర్గతంగా అంచనా వేసుకున్న వంద పతకాల లక్ష్యానికి తగ్గింది. అథ్లెట్ల సన్నద్ధత కోసం వందల కోట్ల ప్రజాధనం ఖర్చు చేసిన నేపథ్యంలో, దీనిపై లోతైన సమీక్ష తప్పదు. స్వర్ణాల సంఖ్య హాంగ్జౌలోని 28 నుంచి ఏడు తగ్గి 21కి చేరింది. చివరి రెండు రోజుల్లో విలుకాండ్రు, బాక్సర్లు, మల్లయోధులు, హాకీ, క్రికెట్ క్రీడాకారుల ప్రదర్శనతో 11 స్వర్ణాలు రావడంతోనే ఈ మాత్రం గౌరవం దక్కింది. చివరి రోజు ఒక్కటే తొమ్మిది పతకాలు, వాటిలో ఐదు స్వర్ణాలు వచ్చాయి. ఉజ్బెకిస్తాన్‌తో స్వర్ణాల సంఖ్యలో సమమైనా (ఇద్దరికీ 21), రజత పతకాలు ఎక్కువగా ఉండటంతో భారత్ తన నాలుగో స్థానాన్ని కాపాడుకుంది. ఈ 21 స్వర్ణాల్లో 13 జట్టు క్రీడల నుంచే వచ్చాయి. క్రికెట్, కబడ్డీ, హాకీ క్రీడల్లో భారత జట్లు క్లీన్ స్వీప్ చేశాయి, అంటే పురుషులు, మహిళలు రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు గెలిచాయి. ఇదంతా ఒక కఠినమైన వాస్తవాన్ని స్పష్టం చేస్తోంది: బహుళ క్రీడా పోటీల్లో విజయాన్ని నిర్ణయించే, అత్యధిక పతకాలు అందించే వ్యక్తిగత క్రీడలైన అథ్లెటిక్స్, ఈత, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, సైక్లింగ్ వంటి వాటిలో భారత్ తన స్థాయిని పెంచుకోవాల్సి ఉంది.

ఈ అంతరం ఎంత పెద్దదో అర్థం కావాలంటే చైనాను చూడాలి. మొత్తం 341 పతకాలతో (169 స్వర్ణాలతో సహా) పరుగెత్తిన చైనా, ఈత కొలనులోనే 54 పతకాలు సాధించింది. అథ్లెటిక్స్ మినహా, ఇతర జల క్రీడల్లో భారత్ ఎక్కడా కనిపించలేదు. కేవలం ఒక క్రీడలో చైనా సాధించిన పతకాల సంఖ్య, మన మొత్తం పతకాల సంఖ్యలో మూడింట రెండొంతులకు దగ్గరగా ఉంది. ఒలింపిక్స్‌లో కూడా పతకాల ఆధిక్యం ఈత, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్ వంటి వ్యక్తిగత క్రీడల్లోనే ఉంటుంది కాబట్టి, ఈ లోటు మరింత తీవ్రమైనది. పారిస్ 2024 ఒలింపిక్స్‌లో భారత్ సాధించింది కేవలం ఆరు పతకాలే (ఒక రజతం, ఐదు కాంస్యాలు), అందులో స్వర్ణం లేదు. ఈ నేపథ్యంలో ఆసియా క్రీడల్లో కనిపించిన బలహీనతలు ఒలింపిక్ వేదికపై మరింత పెద్దవిగా కనిపిస్తాయి. అదే సమయంలో కొన్ని సానుకూల అంశాలనూ విస్మరించకూడదు. భారత్ 310 మంది అరంగేట్ర క్రీడాకారులను బరిలోకి దించి, లాస్ ఏంజెలెస్ 2028 ఒలింపిక్స్‌కు ముందు అథ్లెట్లు–పతకాల నిష్పత్తిలో స్వల్ప మెరుగుదల నమోదు చేసింది. పలు చారిత్రక ప్రదర్శనలు ఆనందించదగినవి. 17 ఏళ్ల కొత్త రికర్వ్ విలుకత్తె కుంకుమ్ మొహద్, కొరియా మహిళల ఆధిపత్యాన్ని బద్దలు కొట్టి, విలువిద్య జట్టు ఐదు స్వర్ణాలు గెలవడానికి దోహదపడటం ఒక నిర్ణయాత్మక క్షణం. ట్రాప్ షూటర్ నీరు దండా, గోల్ఫ్ క్రీడాకారిణి ప్రణవి ఉర్స్, మల్లయోధుడు సుజీత్ కల్కల్ ఆకట్టుకున్నారు. పారిస్ ఒలింపిక్స్ రజత విజేత చైనాను ఓడించి, 44 ఏళ్ల తర్వాత స్వర్ణం గెలిచిన భారత మహిళా హాకీ జట్టు ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది.

లవ్లీనా బోర్గోహైన్, అమన్ సెహ్రావత్, మీరాబాయి చాను, విత్యా రామ్‌రాజ్, గుల్వీర్ సింగ్ అంచనాలకు తగ్గట్టుగా రాణించారు. బాక్సర్లు, మల్లయోధులు, గోల్ఫర్లు గుర్తించదగిన మెరుగుదల కనబరిచారు. విలువిద్య, హాకీలో లభించిన ఒలింపిక్ అర్హత స్థానాలు ఉత్సాహాన్ని మరింత పెంచాయి. మహిళలు పురుషులతో సమానంగా పతకాలు సాధించడం, అంటే ఇద్దరూ చెరో 38 పతకాలు అందించడం మరో ప్రోత్సాహకరమైన సంకేతం. అయితే, నాణేనికి మరో వైపు కూడా ఉంది. భారత్‌కు ప్రధాన పతకాల వనరులైన అథ్లెటిక్స్ (24 పతకాలు), షూటింగ్ (15 పతకాలు) కలిపి 2023తో పోలిస్తే 12 పతకాలు తక్కువగా అందించాయి. షట్లర్లు వెనుకబడ్డారు, టెన్నిస్ క్రీడాకారులు 40 ఏళ్ల తర్వాత పతకం లేకుండా తిరిగొచ్చారు. పీవీ సింధు, మను భాకర్ ఆశించినంతగా రాణించలేకపోయారు. ఈ పరిస్థితిని సరిదిద్దుకునేందుకు, అథ్లెట్లకు ఇచ్చే నిధులపై కఠినమైన పరిశీలన, దీర్ఘకాలిక దృష్టితో రూపొందించిన సవరించిన 'ఖేలో ఇండియా' పథకాన్ని సమర్థంగా అమలు చేయడం అత్యవసరం. మొదటిది, ఏ క్రీడకు ఎంత ఖర్చు పెడుతున్నారు, ఆ ఖర్చుకు తగిన ఫలితం వస్తోందా? అన్న లెక్కలు పారదర్శకంగా బహిర్గతం కావాలి. రెండోది, పతకాల సామర్థ్యమున్న వ్యక్తిగత క్రీడలకు చిన్న వయసు నుంచే ప్రతిభాన్వేషణ, శాస్త్రీయ శిక్షణ, అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించాలి. మూడోది, క్రీడా సంఘాల్లో నిర్వహణ లోపాలు, రాజకీయ జోక్యం తగ్గి, ప్రతిభకే ప్రాధాన్యం దక్కాలి. నాలుగోది, ఈత కొలనులు, అథ్లెటిక్స్ ట్రాకులు, జిమ్నాస్టిక్స్ హాళ్లువంటి మౌలిక వసతులు గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాలకూ చేరాలి. భారత క్రీడా ప్రమాణాలను పెంచకుండా ఒలింపిక్ ఆతిథ్యం కోసం ముందుకెళ్తే, అది అంతర్జాతీయ ఇబ్బందికి ఒక కౌంట్‌డౌన్‌గా మారే ప్రమాదం ఉండకపోదు. ఒలింపిక్స్ ఆతిథ్యం అంటే కేవలం స్టేడియాలు, ఏర్పాట్లు మాత్రమే కాదు, ఆ వేదికపై దేశ క్రీడాకారులు గర్వంగా నిలబడగలగడం కూడా; ఆ రెండూ కలిసినప్పుడే కల సార్థకమవుతుంది! ■



ఒక కుర్రాడు జనవరిలో జిమ్‌లో చేరి, మార్చికల్లా సిక్స్ ప్యాక్ రాలేదని వదిలేశాడు. పక్కనే ఒకాయన రోజూ ఆరేళ్లుగా వాకింగ్ చేస్తున్నాడు, ఇప్పుడు ఆయన ఆరోగ్యం చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. చాలామంది ఏడాదిలో సాధించేది ఎక్కువ ఊహించుకుంటారు, పదేళ్లలో సాధించేది తక్కువ అంచనా వేస్తారు. నిజమైన సంపద రాత్రికి రాత్రే రాదు, అది దశాబ్దాల నిలకడైన క్రమశిక్షణ నుంచే పుడుతుంది. రోజూ వేసే చిన్న అడుగులే చివరికి పెద్ద గమ్యాన్ని చేరుస్తాయి.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## ప్రార్థన వేళ 'అతిథి'గా వచ్చిన రకూన్!



న్యూయార్క్‌లోని గ్రీన్‌విచ్‌లో ఉన్న సెయింట్ జోసెఫ్స్ చర్చిలో సెప్టెంబర్ 25న కొవ్వొత్తుల వెలుగులో 'నైట్‌ఫైర్' ప్రార్థన జరుగుతోంది. ఇంతలో ఒక రకూన్ ఎంచక్కా మెట్లెక్కి, ముందు తలుపు తోసుకుని లోపలికి వచ్చేసింది! హాల్‌లో దాన్ని చూసిన ఫాదర్ జోనా టెల్లర్ మర్యాదగా "బయటకు వెళ్లు నాయనా" అని చెప్పగా, అది కిందకు దిగి 6వ అవెన్యూలో పరుగందుకుంది. "సిటీలో వీటిని ఎప్పుడూ చూడలేదు!" అని ఒక బాటసారి ఆశ్చర్యపోయాడు. సరిగ్గా సెయింట్ ఫ్రాన్సిస్ పండుగ, జంతువులకు ఆశీర్వాదం ఇచ్చే వేడుకకు వారం ముందే ఈ 'భక్తుడు' రావడం విశేషం!

# కండలు సరే..కిడ్నీలు భద్రం



శరీర సౌష్ఠవాన్ని, సామర్థ్యాన్ని మెరుగు పరచుకోవాలని ఎవరికి ఉండదు? మంచి బలంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తే కలిగే ఆత్మ విశ్వాసమే వేరు. అందుకే చాలామంది ఇప్పుడు జిమ్‌ల మీద ఆసక్తి చూపుతున్నారు. కసరత్తులతో కండలు పెంచుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. కాకపోతే కొందరు.. ముఖ్యంగా యువత కృత్రిమంగా, అసహజ పద్ధతులతో అతి వేగంగా కండలు పొంగించుకోవాలని తాపత్రయ పడటమే చిక్కులు తెచ్చిపెడుతోంది. ప్రొటీన్ పొడులు, ప్రొటీన్ మిల్క్‌షేక్‌లు, క్రియాటిన్, అనబాలిక్ స్టెరాయిడ్లు, నొప్పి మందుల వాడకం పెద్ద నష్టమే కలిగిస్తోంది. రక్తాన్ని శుద్ధి చేసి, శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచే కిడ్నీల మీద ఇవి అదనపు భారాన్ని పడేస్తున్నాయి. చివరికి కిడ్నీలు దెబ్బతినే పరిస్థితికీ దారితీస్తుండటం ఆందోళనకరం.

అతడి వయసు 25. ఆరేళ్లుగా జిమ్‌కు వెళ్తున్నాడు. కండలు పెద్దగా పెరగటానికి క్రియాటిన్, ప్రొటీన్ పొడి తీసుకోవాలని అక్కడి ట్రెయినర్ సూచించాడు. నిజమే కాబోలని వాడటం మొదలెట్టాడు. ఒకరోజు కళ్లు తిరగటం, అలసటగా అనిపించింది. పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ మళ్లీ ఇబ్బంది పడుతుండటంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రక్తంలో క్రియాటినిన్ మోతాదు పెరగటంతో రెండుసార్లు డయాలసిస్ చేయాల్సి వచ్చింది. అదృష్టం కొద్దీ కిడ్నీ పాడవలేదు. కానీ కిడ్నీ నుంచి చిన్న ముక్కను తీసి పరీక్షిస్తే- రక్తాన్ని వడపోసే కిడ్నీల్లోని భాగాలు చాలావరకూ దెబ్బతిన్నట్టు, మూసుకుపోయినట్టు తేలింది. ఒకవేళ ఆసుపత్రికి రావటం కొద్దిరోజులు ఆలస్యమైనట్టయితే కిడ్నీ కోలుకోలేనంతగా దెబ్బతినేదే. అతిగా క్రియాటిన్, ప్రొటీన్ వాడకం వల్ల తలెత్తే అనర్థాలకు ఇదొక ఉదాహరణ. త్వరగా కండరాలను పెంచుకోవాలనే ఆశతో ఇలాంటి అనుచిత పద్ధతులను పాటించే ధోరణి యువతలో ఇటీవల పెరిగిపోతోంది. ఎంతోమంది అనబాలిక్ స్టెరాయిడ్లు, నొప్పి మాత్రలనూ వాడుతున్నారు. ఇవన్నీ కిడ్నీలను దెబ్బతీసే ప్రమాదముండటం గమనార్హం. జిమ్‌లో వ్యాయామాలు చేయటం మంచిదే అయినా జాగ్రత్తగా ఉండటమూ ముఖ్యమేనన్న సంగతి మరవరాదు.

## క్రియాటిన్ కీలక అవయవాలకు చేటు

శరీరంలోని చాలా కండరాల్లో క్రియాటిన్ ఉంటుంది. ఇది పనులు, వ్యాయామం చేస్తున్నప్పుడు కండరాలకు నిరంతరం శక్తి అందిస్తుంది. కండరాలు పుంజుకోవటానికి, త్వరగా కోలుకోవటానికీ తోడ్పడుతుంది. అందుకే జిమ్‌లకు వెళ్లేవారు ఎక్కువసేపు వ్యాయామం చేయటానికి, కండర పుష్టి కోసం పొడులు, మాత్రలు, చాక్లెట్ల రూపంలో అదనంగా వాడుతుంటారు. క్రియాటిన్ పదార్థం ఒక స్థాయి వరకూ పెద్దగా హాని చేయదు. కానీ పెద్దమొత్తంలో తీసుకుంటే మాత్రం మెదడు, కిడ్నీల వంటి కీలక అవయవాల మీద విపరీత ప్రభావం చూపుతుంది. క్రియాటిన్ విచ్ఛిన్నమయ్యే క్రమంలో క్రియాటినిన్ అనే వ్యర్థ పదార్థంగా మారుతుంది. ఇది రక్తంలో కలిసి కిడ్నీలకు చేరుకుంటుంది. దీన్ని వడగట్టటానికి కిడ్నీలు ఎక్కువ కష్టపడి పనిచేయాల్సి వస్తుంది. దీంతో కిడ్నీలు అలసిపోయి, దెబ్బతినే ప్రమాదముంది. కిడ్నీలు సరిగా వడగట్టకపోతే రక్తంలో క్రియాటినిన్ మోతాదులు పెరుగుతాయి. సాధారణంగా ఇది 0.7 నుంచి 1.2 ఎంజీ/డీఎల్ వరకూ ఉండొచ్చు. అంతకన్నా మించితే కిడ్నీ దెబ్బతింటోందనే అర్థం. పొడులు, చాక్లెట్ల రూపంలో క్రియాటిన్ తీసుకునే కొందరిలో క్రియాటినిన్ మోతాదులు 25 ఎంజీ/డీఎల్ వరకూ ఉంటుండటం.. వీరికి తాత్కాలికంగా డయాలసిస్ చేయాల్సిన అవసరమూ ఏర్పడుతుండటం గమనార్హం.

## ప్రొటీన్ కిడ్నీల మీద అదనపు భారం

జిమ్‌లకు వెళ్లేవారిలో చాలామంది వే ప్రొటీన్‌ను తీసుకోవటం ఎక్కువైంది. ఇదిప్పుడు అన్నిచోట్లా తేలికగా అందుబాటులో ఉంటోంది. ప్రొటీన్ కండరాలు పుంజుకోవటానికి తోడ్పడే మాట నిజమే అయినా అనవసరంగా, అతిగా వాడటం హానికరంగా పరిణమిస్తుంది. సాధారణంగా రోజుకు ఒక కిలో శరీర బరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. జిమ్‌కు వెళ్లేవారు తెలిసో తెలియకో 1.5 నుంచి 2 గ్రాముల వరకూ తీసుకుంటుంటారు. 5 గ్రాముల వరకూ తీసుకునేవారు లేకపోలేదు. ఇది చాలా ప్రమాదకరం. ప్రొటీన్ విచ్ఛిన్నమైనప్పుడు పుట్టుకొచ్చే యూరిక్ ఆమ్లం వంటి వ్యర్థాలను వడపోయటానికి, బయటకు పంపటానికి కిడ్నీలు ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది. అప్పటికే ఊబకాయం గలవారికి, మాంసాహారులకైతే ప్రొటీన్ పొడులు మరింత చేటు చేస్తాయి. కొందరికి తక్కువ బరువుతో పుట్టటం వంటి కారణాలతో చిన్నప్పటి నుంచే కిడ్నీల్లో రక్తాన్ని వడగట్టే భాగాల సంఖ్య తక్కువగా ఉండొచ్చు. దీంతో రక్తం వడపోత ప్రక్రియ కూడా మందగిస్తుంది. కిడ్నీ పనితీరు బాగా తగ్గిపోయేంత వరకూ పైకి ఎలాంటి లక్షణాలూ కనిపించవు. అంతా బాగానే ఉందనుకుంటారు. ఇలాంటివారు తెలిసో తెలియకో అదనంగా ప్రొటీన్ పొడుల వంటివి తీసుకుంటే కిడ్నీల మీద మరింత భారం పెరుగుతుంది. క్రమంగా దెబ్బతినే ప్రమాదముంది. వీరికి మూత్రంలో సుద్ద (అల్బుమిన్) పడుతుంది కూడా. కొన్నిసార్లు ప్రొటీన్ పొడుల్లో భార లోహాలూ ఉండొచ్చు. ఇవీ దీర్ఘకాల కిడ్నీ జబ్బుకు దారితీసే ప్రమాదమూ ఉంది.

## నొప్పి మాత్రలు ఏవైనా నష్టమే

జిమ్‌లకు వెళ్లి కఠినమైన వ్యాయామాలు చేసేవారు తరచూ నొప్పులను తగ్గించే మాత్రలు వేసుకుంటుంటారు. దీంతో మరింత ఎక్కువగా వ్యాయామాలు చేస్తుంటారు. అసలు విషయం ఏంటంటే- నొప్పి మందులేవైనా ౘకిడ్నీలకు చేటు చేయటం. ట్రెమడాల్ వంటి కొన్ని సురక్షితమైన మందులున్నప్పటికీ ఇవి గుండె సమస్యలకు దారితీయొచ్చు. కొందరికి వీటితో వెంటనే వాంతులవుతుంటాయి కూడా. డైక్లోఫెనాక్, ఐబూప్రొఫెన్ వంటి ఎన్ఎస్ఏఐడీ రకం నొప్పి మందులను చీటికీ మాటికీ వేసుకుంటే కిడ్నీలు దెబ్బతినొచ్చు. ఇవి కిడ్నీలకు రక్త సరఫరా తగ్గేలా చేయటం ద్వారా వడపోత ప్రక్రియను అస్తవ్యస్తం చేస్తాయి. రక్తంలో సోడియం, నీరు పేరుకునేలా చేస్తాయి కూడా. అందుకే నొప్పి మాత్రలు వేసుకోగానే ఉబ్బినట్టుగా కనిపిస్తారు. కొందరు దీన్ని బరువు పెరిగినట్టుగానూ పొరపడుతుంటారు.



## అనబాలిక్ స్టెరాయిడ్లు రక్తనాళాలకు దెబ్బ

స్టెరాయిడ్లు ఒక్క కండరాలు పెరగటానికే కాదు, రకరకాల పనుల్లో పాలు పంచుకుంటాయి. చాలా జబ్బుల చికిత్సల్లో స్టెరాయిడ్లు వాడుతుంటారు. వీటిల్లో ఒకరకం అనబాలిక్ స్టెరాయిడ్లు. ఇవి కండరాలు, బరువు, రక్త పరిమాణం పెంచటం వంటి మంచి పనులూ చేస్తాయి. అలాగని దీర్ఘకాలంగా, అనవసరంగా వాడితే రక్తనాళాల లోపలి పైపొర దెబ్బతింటుంది. దీంతో రక్తపోటు పెరగటం, కిడ్నీలు దెబ్బతినటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. కిడ్నీలను లోపలి నుంచి చూస్తే రక్త గుచ్ఛం మాదిరిగా ఉంటాయి. అందువల్ల రక్తనాళాలను ప్రభావితం చేసే, దెబ్బతీసే ఏ జబ్బయినా వడపోత సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. అనబాలిక్ స్టెరాయిడ్లతో గుండె కండరం మెత్తగా, బలహీనంగా అవటం మరో సమస్య. దీంతో గుండె రక్తాన్ని సరిగా పంప్ చేయలేదు. ఫలితంగా కిడ్నీల్లో వడపోత ప్రక్రియ కూడా మందగిస్తుంది. స్టెరాయిడ్లు రక్తంలో సోడియం, నీటి మోతాదు పెరిగేలా చేస్తాయి కూడా. దీంతో ఒళ్లంతా ఉబ్బినట్టు అవుతుంది. దీన్ని కొందరు బలంగానూ భావిస్తుంటారు. బరువు పెరిగామని అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. కిడ్నీలు, గుండె పనితీరు మందగించటమే కారణమని తెలుసుకోవాలి.

## ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

వీలైనంతవరకూ ఆహారం ద్వారానే నాణ్యమైన ప్రొటీన్ లభించేలా చూసుకోవాలి. మాంసాహారంతో లభించే ప్రొటీన్‌తోనే కండలు పెరుగుతాయని అనుకోవటం అపోహ. శాకాహార ప్రొటీన్ కూడా కండర పుష్టికి తోడ్పడుతుంది. చిక్కుడు జాతి కూరగాయలు, పప్పులు, పాలు, పెరుగు వంటి వాటితో ప్రొటీన్ బాగా లభిస్తుంది. నిజానికి వే ప్రొటీన్ పొడి పన్నీరు తయారీలో మిగిలిన ద్రవం నుంచే తయారు చేస్తారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కండర పుష్టికి ఇదే కీలకం. కానీ ఏవేవో పొడులు, మాత్రలు తీసుకుంటేనే కండలు పెరుగుతాయని అనుకోవద్దు. వీటితో కండ వృద్ధి చెందినా అది తాత్కాలికమేనని తెలుసుకోవాలి.

ప్రొటీన్ పొడులు, అనబాలిక్ స్టెరాయిడ్ల వంటివి తప్పనిసరిగా వాడాల్సిన పరిస్థితుల్లో విధిగా డాక్టర్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. తగు పరీక్షలు చేయించుకొని, శారీరకంగా బలంగా ఉన్నట్టు తేలితే వీటిని వాడుకోవచ్చు.

శరీర సామర్థ్యాన్ని గమనించకుండా ఒక స్థాయిని మించి, గంటల తరబడీ వ్యాయామం చేయటం మంచిది కాదు. హఠాత్తుగా గుండెపోటు రావటానికి ఇదీ ఒక కారణమేనని గుర్తించాలి.

బాగా ఎండగా, వేడిగా ఉన్న చోట్ల వ్యాయామాలు చేయొద్దు.

వ్యాయామాలు చేస్తున్నప్పుడు మధ్యమధ్యలో నీళ్లు కూడా తాగాలి. కేవలం ప్రొటీన్ మిల్క్ షేక్స్‌తోనే శక్తి లభిస్తుందని అనుకోవద్దు. నీటితో లభించే శక్తి, ఉత్సాహం మరే పానీయంతోనూ రాదు.

పొటాషియం లోపం గలవారు అరటి, ఖర్జూరం వంటి పండ్లు తినటం మంచిది.

## ఇవీ ప్రమాద హెచ్చరికలు

కళ్లు తిప్పినట్టు, తల తేలిపోతున్నట్టు అనిపించటం.

త్వరగా అలసిపోవటం, నిస్సత్తువ, నీరసం.

మూత్రం అంతగా రాకపోవటం.

పాదాలు, చీలమండలు, ముఖం, చేతులు ఉబ్బటం.

రాత్రిపూట తరచూ మూత్రానికి వెళ్లాల్సి రావటం.

**ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయరాదు.**

## వీరు వాడొద్దు

మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలు గలవారు.

నెలలు నిండక ముందే పుట్టినవారు, పుట్టుకతో తక్కువ బరువుతో ఉన్నవారు.

పొగ తాగే అలవాటు గలవారు.

ఊబకాయం గలవారు.

ఇలాంటివారు తక్కువ కాలంలో కండలు, బరువు పెరగటానికి క్రియాటిన్, ప్రొటీన్ వాడకపోవటమే మంచిది.

# శ్రేయస్ సూపర్ సెంచరీ.. విండీస్‌పై భారత్ ఘన విజయం

- కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 43 బంతుల్లో 102 పరుగులతో అజేయ శతకం
- 172 పరుగుల లక్ష్యాన్ని 14.4 ఓవర్లలోనే ఛేదించిన టీమిండియా
- ఇషాన్ కిషన్‌తో కలిసి అయ్యర్ 137 పరుగుల అజేయ భాగస్వామ్యం
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లిన భారత్



వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విధ్వంసకర సెంచరీతో కదం తొక్కాడు. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై, అయ్యర్ ఆడిన సుడిగాలి ఇన్నింగ్స్ ముందు వెస్టిండీస్ బౌలర్లు తేలిపోయారు. కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచిన అయ్యర్.. టీమిండియాకు అద్భుత విజయాన్ని అందించాడు. అతని బ్యాటింగ్ ధాటికి 172 పరుగుల లక్ష్యం చాలా చిన్నదిగా కనిపించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బ్యాటర్లలో షాయ్ హోప్ (52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (56) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో నమన్ ధిర్ 3 వికెట్లతో సత్తా చాటగా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (21), సంజూ శాంసన్ (11) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 35 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ క్లిష్ట దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. ఆట స్వరూపాన్నే మార్చేశాడు. వచ్చినప్పటి నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతనికి ఇషాన్ కిషన్ (37 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. ఒకవైపు అయ్యర్ బౌండరీల వర్షం కురిపిస్తుండగా, మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్ సంయమనంతో ఆడి వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు కేవలం 67 బంతుల్లోనే 137 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయ్యర్ తన కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షంగా మార్చేశాడు. ఫలితంగా భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఘన విజయం సాధించింది. తమ ఇన్నింగ్స్ లో మరో 20 పరుగులు చేసుంటే బాగుండేదని విండీస్ భావించినప్పటికీ, అయ్యర్ బ్యాటింగ్ తీరు చూశాక మరో 60 పరుగులు చేసినా కరీబియన్లు గెలవలేరని స్పష్టమైంది.ఇక ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఈ నెల 9న రాంచీలో జరగనుంది.

## పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు భారీ షాక్.. సగం ధరకే ప్రసార హక్కుల విక్రయం!



పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. తమ దేశంలో జరిగే 25 అంతర్జాతీయ మ్యాచ్‌ల ప్రసార హక్కులను నిర్ణయించిన ధర కంటే దాదాపు సగం ధరకే విక్రయించాల్సి వచ్చింది. ప్రసార హక్కుల కోసం ప్రభుత్వ టెలివిజన్ సంస్థ 'పాకిస్థాన్ టెలివిజన్ కార్పొరేషన్' (పీటీవీ) మాత్రమే బిడ్ దాఖలు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.పీసీబీ ఇటీవల ప్రసార హక్కుల కోసం టెండర్ జారీ చేసింది. దీనికి రూ.600 మిలియన్లను (పాకిస్థానీ రూపాయలు) రిజర్వ్ ధరగా నిర్ణయించింది. గతంలో మాదిరిగా పలు సంస్థలు కలిసి కన్సార్టియంగా బిడ్ వేసే అవకాశం ఈసారి ఇవ్వలేదు. దీంతో పోటీ తగ్గిపోయింది. చివరకు పీటీవీ రూ.350 మిలియన్లకు బిడ్ వేసి హక్కులను దక్కించుకుంది. అంటే బోర్డు నిర్ణయించిన ధరతో పోలిస్తే దాదాపు రూ.250 మిలియన్లు తక్కువకే హక్కులు విక్రయించాల్సి వచ్చింది.కొత్త ఒప్పందంలో మొత్తం 25 హోమ్ మ్యాచ్‌లు ఉన్నాయి. ఇందులో ఐదు టెస్టులు, 14 వన్డేలు, ఆరు టీ20లు ఉన్నాయి. ఈ నెలలో పాకిస్థాన్.. శ్రీలంకతో మూడు టీ20లు ఆడనుంది. ఆ తర్వాత ఇంగ్లాండ్‌తో కలిసి ఏడు మ్యాచ్‌ల ట్రై సిరీస్ జరగనుంది. వచ్చే నెలలో శ్రీలంకతో రెండు టెస్టులు కూడా ఉన్నాయి.

పాకిస్థాన్ జాతీయ జట్టు ఇటీవలి ప్రదర్శన అంతంతమాత్రంగానే ఉండటం వల్ల స్పాన్సర్లు, ప్రకటనదారులు క్రికెట్‌పై పెద్దగా ఆసక్తి చూపడం లేదని పీసీబీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు గతంలో కన్సార్టియంగా ప్రసార హక్కులు తీసుకున్న కనీసం మూడు సంస్థలు పీసీబీకి ఇంకా బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో ఈసారి బిడ్ వేసేందుకు ఆసక్తి చూపిన సంస్థల సంఖ్య భారీగా తగ్గిపోయింది.బకాయిలు ఉన్న సంస్థలను బిడ్డింగ్ నుంచి పీసీబీ నిషేధించలేదు. అయినా అవి స్వచ్ఛందంగా పోటీకి దూరంగా ఉన్నాయని సమాచారం. గతంలో పాకిస్థాన్ క్రికెట్ ప్రసార హక్కుల్లో ఎక్కువ భాగం దక్కించుకున్న ఓ సంస్థ కూడా ఈసారి ఆసక్తి చూపలేదు.ఇక 2027 జనవరిలో ఐర్లాండ్‌తో మూడు టీ20లతో పాటు ఐర్లాండ్, జింబాబ్వే పాల్గొనే ఏడు మ్యాచ్‌ల ట్రై సిరీస్ కూడా ఈ ప్రసార ఒప్పందంలో ఉంది. అయితే అంతర్గత బోర్డు సమస్యల కారణంగా పాకిస్థాన్ పర్యటనకు జింబాబ్వే వచ్చే పరిస్థితిలో లేదని ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది.

ఇటీవల పాకిస్థాన్ సూపర్ లీగ్ 11వ సీజన్ సమయంలోనూ పీసీబీకి ప్రసార హక్కుల విషయంలో ఆశించిన స్పందన రాలేదు. గత సీజన్ హక్కులు దక్కించుకున్న ఓ ప్రసార సంస్థ ఇప్పటికీ బోర్డుకు బకాయి పడినట్లు సమాచారం. దీంతో పాకిస్థాన్ క్రికెట్ ఆర్థిక పరిస్థితిపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## 'ప్లేయర్స్ కెప్టెన్.. వ్యూహాల్లో చాలా షార్ప్'.. శ్రేయస్‌పై లక్ష్మణ్ ప్రశంసలు



ఆసియా క్రీడల్లో భారత జట్టుకు స్వర్ణం అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై హెడ్ కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసలు కురిపించాడు. శ్రేయస్ ఆటగాళ్ల కెప్టెన్ అని కొనియాడాడు. ప్రతి ఆటగాడిని సౌకర్యంగా ఉంచుతూ, వారి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టే సామర్థ్యం ఉందని చెప్పాడు. కెప్టెన్‌గా అతడికి మంచి భవిష్యత్ ఉందని ఆశాభావం వ్యక్తం చేశాడు.జట్టు సమావేశాలకు ముందే శ్రేయస్ ప్రత్యర్థి బలాలు, బలహీనతలపై కసరత్తు చేస్తాడని లక్ష్మణ్ తెలిపాడు. ఫిట్‌నెస్‌కు కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తాడని చెప్పాడు. టీ20ల్లో ప్రత్యర్థి కంటే ఒకటి, రెండు అడుగులు ముందుండేలా వ్యూహాలు సిద్ధం చేసుకుంటాడని ప్రశంసించాడు.

జట్టులోని ప్రతి ఆటగాడి సామర్థ్యాన్ని శ్రేయస్ బాగా అర్థం చేసుకున్నాడని లక్ష్మణ్ అన్నాడు. పరిస్థితులకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకోవడంలో అతడు చాలా చురుకుగా ఉంటాడని పేర్కొన్నాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్‌లోనూ ముందుండి జట్టును నడిపిస్తాడని చెప్పాడు.

శ్రేయస్ నాయకత్వంలో భారత్ ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. ఫైనల్లో పాకిస్థాన్‌ను 19 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 211/6 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 28 బంతుల్లో 61 పరుగులు చేశాడు. తిలక్ వర్మ 22 బంతుల్లో అజేయంగా 51 పరుగులు సాధించాడు.లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 192/6కే పరిమితమైంది. హసన్ నవాజ్ 51 బంతుల్లో 96 పరుగులతో పోరాడాడు. చివరి బంతికి శివమ్ దూబే అతడిని ఔట్ చేయడంతో భారత్ స్వర్ణం ఖాయం చేసుకుంది.జపాన్‌లో ప్రతికూల వాతావరణం, ప్రయాణ సమస్యలు, సాధనకు తక్కువ సమయం ఉన్నా ఆటగాళ్లు అద్భుతంగా సర్దుకుపోయారని లక్ష్మణ్ చెప్పాడు. కఠిన పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంతో ఆడటం తనను ఆకట్టుకుందని తెలిపాడు. భారత క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవ లేదని పేర్కొన్నాడు.

# వెండితెర ప్రేమికులుగా రియల్ కపుల్స్







నిజజీవిత జంటలు వెండితెరపై అలరించడం ఎప్పుడూ ఒక ప్రత్యేక ఆకర్షణే. నిజ జీవితంలో ప్రేమించుకుని లేదా వివాహం చేసుకుని.. ఆ తర్వాత ఆన్-స్క్రీన్‌లోనూ జంటగా కనిపించి ప్రేక్షకులను అలరించిన జోడీల ట్రెండ్ ఇప్పుడు మరింత ఊపందుకుంటోంది. టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకమైన -రణబాలి- చిత్రంలో జంటగా నటిస్తూ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతున్నారు. అలాగే బాలీవుడ్‌లో కొత్తగా పెళ్లయిన సోనాక్షి సిన్హా- జహీర్ ఇక్బాల్ జంటగా నటిస్తున్న -తు హై మేరి కిరణ్- సినిమా ట్రైలర్ అక్టోబర్ 6న విడుదల కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు స్టార్ కపుల్స్ రణబీర్ కపూర్ - ఆలియా భట్ కూడా సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం -లవ్ అండ్ వార్- తో వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారు.ఈ కోవలోనే మరికొన్ని రియల్ లైఫ్ జోడీల ఆన్-స్క్రీన్ ప్రయాణం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే -షేర్షా- చిత్రంతో అందరినీ అలరించిన సిద్ధార్థ్ మల్హోత్రా- కియారా అద్వానీ జంట మరో కొత్త సినిమా కోసం సన్నాహాలు చేస్తున్నారనే వార్తలు ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. అలాగే గతంలో -మహాసముద్రం- చిత్రంలో కలిసి నటించిన సిద్ధార్థ్ - అదితి రావ్ హైదరీల జోడీ కూడా రియల్ లైఫ్‌లో ఒక్కటైన తర్వాత మరో కొత్త ప్రాజెక్ట్‌లో కలిసి నటిస్తారనే ఆసక్తి అభిమానుల్లో ఉంది. ఇలా నిజ జీవితంలో జంటగా ఉన్న నటీనటులు వెండితెరపై కూడా తమ కెమిస్ట్రీని రిపీట్ చేస్తుండటం సినిమాపై అదనపు క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది.ఇక టాలీవుడ్ విషయానికి వస్తే.. ఇటీవల వివాహబంధంతో ఒక్కటైన నాగచైతన్య - శోభిత ధూళిపాల జోడీని వెండితెరపై ఎప్పుడెప్పుడు చూస్తామా? అని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ రియల్ లైఫ్ జోడీని ఒకే ఫ్రేమ్‌లో చూడాలంటే ఏ దర్శకుడు సాహసం చేస్తారనే చర్చ టాలీవుడ్‌లో జోరుగా సాగుతోంది. త్వరలో అప్‌కమింగ్ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్న దర్శకుడు చందు మొండేటి లాంటి టాలెంటెడ్ డైరెక్టర్లు వీరిద్దరితో ఎలాంటి కథతో సినిమా తెస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మొత్తానికి రీసెంట్ టైమ్స్‌లో రియల్ జోడీల ఆన్-స్క్రీన్ రొమాన్స్ ప్రేక్షకులకు అంతులేని వినోదాన్ని పంచుతోంది.కాస్త సీనియర్లలో అక్కినేని నాగార్జున, అమల జంట విషయానికి వస్తే.. వీరు పెళ్లికి ముందే పలు చిత్రాల్లో జంటగా నటించి ప్రేక్షకులను ఎంతగానో అలరించారు. -కిరాయి దాదాలు-,-శివ-,-ప్రేమ యుద్ధం-, -అగ్ని పుత్రుడు- వంటి విజయవంతమైన చిత్రాల్లో వీరు కలిసి నటించారు. ఆ తర్వాత పరస్పరం ఇష్టపడి పెద్దల అంగీకారంతో 1992లో వివాహం చేసుకున్నారు. అయితే విశేషం ఏమిటంటే.. పెళ్లి అయిన తర్వాత అమల పూర్తి సమయం నటనకు దూరంగా ఉంటూ కేవలం వ్యక్తిగత జీవితం -జంతు సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. అందువల్ల వీరు పెళ్లి తర్వాత ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు.ఇక పలు చలనచిత్ర పరిశ్రమలలో (బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్) నిజ జీవితంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న నటీనటులు ఆన్-స్క్రీన్‌లోనూ జంటగా అలరించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. బాలీవుడ్‌లో రిషి కపూర్ - నీతూ కపూర్, అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్య రాయ్, అజయ్ దేవగణ్ - కాజోల్, అలాగే ఇటీవలి కాలంలో దీపికా పదుకొణె - రణ్‌వీర్ సింగ్ వంటి జంటలు తమ నిజ జీవిత బంధానికి ముందో లేదా ఆ తర్వాతో సినిమాల్లో జంటగా నటించి మెప్పించారు. అలాగే టాలీవుడ్‌లో మహేష్ బాబు - నమ్రత (పెళ్లికి ముందు -వంశీ- చిత్రంలో), కోలీవుడ్‌లో సూర్య - జ్యోతిక (కాకా కాక, చంద్రముఖి తదితర చిత్రాలు), అజిత్ - శాలిని (అమరకలం), మాలీవుడ్‌లో బిజు మీనన్ - సంయుక్త వర్మ వంటి ఎంతోమంది రియల్ కపుల్స్ వెండితెరపై కూడా ప్రేమికులుగా-భార్యాభర్తలుగా నటించి తమ అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులను అలరించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965